తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
17 ఆగస్టు, 2025



# మార్కెట్ మాయలో జనం విలవిల!

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
17 ఆగస్టు, 2025



# మార్కెట్ మాయలో జనం విలవిల!

# కీలక పాత్రలో రుక్మిణి వసంత్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'కాంతార' చిత్రానికి ప్రీక్వెల్‌గా వస్తున్న 'కాంతార చాప్టర్ 1' సినిమా ప్రమోషన్లు ప్రారంభం అయ్యాయి. రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న ఈ చిత్రంపై ఉన్న భారీ అంచనాలకు తగ్గట్టే, చిత్ర బృందం ఒక కీలక అప్‌డేట్‌తో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కథానాయిక పాత్రను, ఆమె పేరును ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ చిత్రంలో 'కనకవతి' అనే కీలక పాత్రలో ప్రముఖ నటి రుక్మిణి వసంత్ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమె పాత్రకు సంబంధించిన వివరాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. 'కాంతార' కథకు ముందు ఏం జరిగిందనే అంశంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బనవాసిని పాలించిన కదంబుల సామ్రాజ్యం కాలంనాటి కథాంశంతో, ఆ కాలంలోని సంస్కృతి, సంప్రదాయాలను ఇందులో చూపించనున్నారు. ముఖ్యంగా భూతకోల ఆచారం వెనుక ఉన్న పురాణ గాథను ఈ ప్రీక్వెల్‌లో ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమాలో రిషభ్ శెట్టి





అతీతశక్తులు కలిగిన నాగ సాధువు పాత్రలో కనిపించనుండటం విశేషం. ఇదివరకే విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. 'కాంతార'ను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ పతాకం పైనే విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని కూడా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. బి.అజ్నీశ్ లోకనాథ్ మరోసారి తన సంగీతంతో మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది అక్టోబర్ 2న కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో ఏక కాలంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాతీరం

# 'డేవిడ్ రెడ్డి'గా మంచు మనోజ్



విలక్షణ నటుడు మంచు మనోజ్ చాలా కాలం తర్వాత ఒక భారీ చారిత్రక యాక్షన్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తన 21వ చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్‌ను ప్రకటించారు. సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 21 యేళ్లు పూర్తయిన ప్రత్యేక సందర్భంగా ఆయన ఈ కొత్త ప్రాజెక్ట్‌ను వెల్లడించారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమా 1897 నుంచి 1922 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం నేపథ్యంలో సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. కుల వివక్ష నుంచి పుట్టి, బ్రిటిష్ సామ్రాజ్యాన్నే గడగడలాడించిన ఒక సామాన్య యోధుడి సాహస గాథగా 'డేవిడ్ రెడ్డి'ని తెరకెక్కించనున్నారు.

"మద్రాస్ ప్రెసిడెన్సీలో పుట్టి, ఢిల్లీలో పెరిగి, ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలిస్తున్నాడు" అనే ట్యాగ్‌లైన్ సినిమా కథాంశంపై అంచనాలను పెంచుతోంది.

ఇందులో మనోజ్ ఇంతవరకు చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. హనుమ రెడ్డి యక్కంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, మోటూకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నామని దర్శక, నిర్మాతలు తెలిపారు.

ఆదివారం వార్త

17 ఆగస్టు, 2025

## మంచి ముత్యాలు

ముఖాలు పుస్తకాలంత స్పష్టంగా ఉంటాయి. కనుక వాటిని కొద్ది సమయంలో సులువుగా అధ్యయనం చేయడానికే గాక, అపార్థం చేసుకోవడానికి కూడా అవకాశాలు తక్కువగా ఉంటాయి. – ఎఫ్.సుందర్స్

## కదంబం


'సంఘీ'భావం....5

నిఘా లోపంతోనే ఫెర్టిలిటీ మోసాలు

కవర్ స్టోరీ..6

మార్కెట్ మాయలో జనం విలవిల

ఈ వారం కవిత్వం...12

దృశ్య మాలికలు

కథ..20

సంధ్యారాగం

సాహిత్యం.. 22

శిలాక్షరాల నుంచి కీ బోర్డ్ వైపు..

ఆధ్యాత్మికతను పెంచే ... 26

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా.. వగైరా..


# సమాచారం

## గోల్డెన్ బ్లడ్ గ్రూప్

బ్లడ్ గ్రూప్‌లంటే వెంటనే గుర్తుకు వచ్చే ఎ, బి, ఎబి, ఒ మొదలైన రకాలు. కానీ మరో అరుదైన బ్లడ్ గ్రూప్ వుందని చాలా.. చాలా.. మందికి తెలియదు. అది కూడా ఆ గ్రూప్ రక్తం ప్రపంచంలో వంద మంది కంటే తక్కువ మందిలోనే వున్నట్లు సమాచారం. అత్యంత అరుదైన ఈ బ్లడ్ గ్రూప్‌ను 'గోల్డెన్ బ్లడ్' అంటారు. ఎర్ర రక్త కణాల్లో ఆర్‌హెచ్ యాంటీజెన్‌లు లేకపోతే దాన్ని 'ఆర్‌హెచ్ నల్ రకం/గోల్డెన్ బ్లడ్ గ్రూప్ అని శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఈ బ్లడ్ గ్రూప్ వున్నవారు అతి తక్కువ మంది వుండడం వల్ల దీనికి ఆ పేరు వచ్చిందేమో! అరుదైన యాంటీజెన్‌లను కలిగివున్న వ్యక్తుల్లో గోల్డెన్ బ్లడ్ మూలాలను గుర్తించవచ్చు. ఇవి ఒ పాజిటివ్, ఒ నెగెటివ్, ఎ పాజిటివ్, ఎ నెగెటివ్, బి పాజిటివ్, బి.నెగెటివ్, ఏబీ పాజిటివ్, ఏబీ నెగెటివ్ లాంటి ప్రసిద్ధమైన బ్లడ్ గ్రూప్ వున్నవారి కన్నా భిన్నంగా ఉంటాయి.

1961లో ఆస్ట్రేలియాకు చెందిన ఓ ఆదివాసీ మహిళ రక్త పరీక్షలు చేయించుకుంటే ఆమె రక్తంలో ఎ,బి లేదా ఆర్‌హెచ్ యాంటీజెన్‌లు లేవని తేలడంతో మొదటిసారి 'గోల్డెన బ్లడ్' గ్రూప్ కేస్‌గా నమోదైంది. 2022లో భారత్‌లోనూ ఇలాంటి కేసు ఒకటి వెలుగు చూసింది. అరవై యేళ్ల దాటిన ఒక వ్యక్తికి గుండెపోటు రావడంతో అతనికి చేసిన పరీక్షల్లో అతడికి గోల్డెన్ బ్లడ్ గ్రూప్ అని తెలిసింది. వైద్య రంగంలో ఈ బ్లడ్ గ్రూపుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

గోల్డెన్ బ్లడ్ గ్రూప్‌ని ప్రాణప్రదాయినిగా చెప్పవచ్చు. ఈ బ్లడ్ గ్రూప్ విశ్వదాత. ఏ గ్రూప్ వారికి రక్తం అవసరమైనా గోల్డెన్ గ్రూప్ రక్తం ఎక్కించవచ్చు. రియాక్షన్స్‌కు ఆస్కారం తక్కువ. అయితే ఆర్‌హెచ్-నల్ బ్లడ్ గ్రూప్ వున్న వ్యక్తులు మాత్రం అదే రకమైన దాతల నుంచి రక్తం తీసుకోవాలి. ఇమ్యునోగ్లోబులిన్ ఆధారిత ఔషధాలను అభివృద్ధి చేసే క్రమంలో ఈ బ్లడ్ గ్రూప్ కీలకంగా మారుతుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

## కిడ్స్ వాకీటాకీలు



ఈ రోజుల్లో పిల్లలు ఫోన్ చూడకుండా ఉండలేకపోతున్నారు. అందుకే వారి కోసం వీడియో కెమెరా 'కిడ్స్ వాకీటాకీ'లు వచ్చేశాయి. ఎల్‌సిడి తెరతో ఉండే ఈ వాకీటాకీలతో ఎంచక్కా వీడియో కాల్ మాట్లాడుకోవచ్చు. మామూలు ఫోన్‌లోలాగే వీటికి ఛార్జింగ్ పెట్టాలి. ఇద్దరు పిల్లలు వంద మీటర్ల దూరం వరకు బటన్ నొక్కి సరదాగా ఎవరు ఏం చేస్తున్నారో.. చూస్తూ వీడియో కాల్స్ చేసుకోవచ్చు. రకరకాల రంగుల్లో, అనేక డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. ఫోన్ కోసం పెద్దవాళ్లను విసిగించే పిల్లలకు ఇదొక మంచి సాధనం.

## చేతులకు రక్షణగా 'డోర్ గార్డ్ ప్రొటెక్టర్'

ఇళ్లల్లో తలుపులకు గోడకు ఉండే ఫ్రేమ్‌కు తలుపుకు మధ్య కొంత గ్యాప్ ఉంటుంది. పిల్లలు ఆడుకుంటూనో అటూ ఇటూ తిరుగుతూనో తలుపు పట్టుకునే క్రమంలో ఆ గ్యాప్‌లో చేతులు పెడుతుంటారు. తలుపు కదిలినప్పుడు గ్యాప్‌లో వారి వేళ్లు ఇరుక్కుని బాధపడతారు. ఒకోసారి తలుపు గట్టిగా పడినప్పుడు వారి వేళ్లు చిట్లిపోతుంటాయి. అలాంటి ఇబ్బందులు ఉండకుండా ఉండేందుకు 'డోర్ గార్డ్ ప్రొటెక్టర్' ఉపయోగపడుతుంది. తలుపులు మూసినప్పుడు, తెరిచినప్పుడు చేతివేళ్లు ఇరుక్కునే అవకాశం ఉండదిక. ఇవి అన్ని రకాల తలుపులకు సరిపోతాయి.



## ల్యాంటెన్ లైట్

కరెంట్ లేని రోజుల్లో లాంతర్లు ఉండేవి. వాటిల్లో కిరోసిన్ పోసి వత్తి పెట్టి వెలిగించేవారు. కరెంట్ వచ్చాక రకరకాల బల్బులు వాడుకలోకి వచ్చాయి. కరెంట్ పోయినప్పుడు వెలుతురు కోసం కొవ్వొత్తులు అందుబాటులోకి వచ్చాయి. వాటిల్లోనూ వివిధ వెరైటీలు ఉండేవి. ప్రస్తుతం సడన్‌గా కరెంట్ పోతే బల్బుల వెలుతురులాగే ఉండే లాంతర్లు వచ్చాయి. వీటిల్లో చాలా రకాలు ఉన్నాయి. ఒకప్పుడు టేబుల్ ల్యాంప్‌లు వాడేవారు. అదే స్థానంలో మరింత వెలుగునిచ్చే ఎమర్జెన్సీ ల్యాంప్‌లు, లైట్‌లు వచ్చాయి.




అచ్చం లాంతరులాగే ఉండే విప్రో కోరల్ ఎమర్జెన్సీ ల్యాంటెన్ లైట్ మార్కెట్లోకి వచ్చింది.

బ్యాటరీతో పనిచేసే ఈ లాంతర్ పూర్తిగా చార్జ్ అవడానికి 8 గంటలు పడుతుంది. ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే, తక్కువ కాంతితో 20 గంటలు, పూర్తి శాతం కాంతితో 1.5 గంటల వరకు బ్యాకప్ ఇస్తుంది.

దీని బరువు తక్కువగా ఉంటుంది. పైన పట్టుకునేందుకు హ్యాండిల్ ఉండటం వల్ల దీనిని ఎక్కడికైనా తీసుకెళ్లడం చాలా సులభం.

## నవాగియో బీచ్

**నవాగియో** ఒక అద్భుత ద్వీపం. ఇందులో అనేక సముద్ర గుహలు ఉన్నాయి. వాటిని చూసేందుకు పడవల ద్వారా మాత్రమే చేరుకోవాలి. ఒకవైపు విశాలమైన ఇసుక తిన్నెలు, మరోవైపు ఎత్తైన పచ్చటి పర్వత శిఖరాలు, చుట్టూ గలగలలాడే నీలాల అలలు.. ఇలా అక్కడి దృశ్యాలు ఎంతో మనోహరంగా ఉంటాయి.

జాకిన్‌థోస్‌లోని అత్యంత ప్రసిద్ధి పొందిన పర్యాటక ఆకర్షణలలో నవాగియో బీచ్ ఒకటి. దీనిని షిప్‌రెక్ బీచ్ అని కూడా పిలుస్తారు. అందమైన గ్రామాలు, చారిత్రక ప్రదేశాలు, వెనీషియన్ శైలిలో నిర్మితమైన భవనాలు ఇలా చుట్టూ చూడదగిన ప్రదేశాలతో జాకిన్‌థోస్ ద్వీపం పర్యాటకులను ఇట్టే ఆకట్టుకుంటుంది.



# 'సంఘీ' భావం



# నిఘా లోపంతోనే ఫెర్టిలిటీ మోసాలు

పెళ్లి చేసుకుని సంవత్సరాలు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడంతో ఆ దంపతులు పడుతున్న వేదనను మోసపూరితంగా లక్షలు కాజేయడానికి కొన్ని ఫెర్టిలిటీ వైద్య సంస్థలు కుట్రలు పన్నుతున్నాయి. మోసం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తేనేగానీ అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. పిల్లలు పుట్టని దంపతులకు వారి మనోవాంఛను పూర్తి చేయడానికి అనేక విధానాలు ఉన్నాయి. శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని పరిష్కరించకుండా వేరే మార్గాల ద్వారా వారికి పిల్లలు పుట్టిస్తామని మోసం చేస్తున్న ఫెర్టిలిటీ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయి. సరైన స్కానింగ్ చేయకుండా, లోపం ఎక్కడ ఉందో గమనించకుండా గర్భంలో పిండాన్ని ఎలా కాపాడాలన్న అంశాన్ని పక్కన పెట్టి దంపతుల నుంచి ఎక్కువ మొత్తాలను ఎలా పిండాలన్న అంశంపైనే ఈ సంస్థలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. దీనితో సరోగసిని ముఖ్యంగా తెరపైకి తీసుకువస్తున్నారు. తమ రక్తం పంచుకుని పుట్టే బిడ్డ కావాలని ఆసక్తి చూపించే దంపతులకు ఈ సంస్థలు గాలం వేస్తున్నాయి.

ఒక్కసారి ఈ సంస్థల ప్రాంగణంలో అడుగు పెడితే వివిధ రకాల పరీక్షల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తారు. ఇక పిల్లల కోసం సరోగసి మాత్రమే ప్రత్యామ్నాయం అని చెబుతూ వారిని ఊబిలోకి దింపుతాయి. మహిళ గర్భసంచిలో లోపం ఉందని తేల్చినట్లు చెప్పి భర్త వీర్యంతో మరో మహిళ కడుపును అద్దెకు తీసుకునే ప్రతిపాదనను ముందుకు పెడతారు. తప్పనిసరి అన్న భావన కల్పించిన తరువాత ఇక దోపిడీ విధానానికి తెరలేపుతారు. మహిళ అద్దె గర్భాన్ని మూడు లక్షల వరకు ఇవ్వవలసి ఉంటుందని చెబుతారు. ఆ తరువాత ఆమెకు పౌష్టికాహారం ఇవ్వకపోతే లోపాలతో కూడిన బిడ్డ పుడుతుందని చెప్పి మరో రెండు లక్షలు వసూలు చేస్తారు. మధ్యలో గర్భం మోస్తున్న మహిళకు జ్వరం/వ్యాధిగానీ వచ్చిందని అత్యవసర చికిత్స కోసం ఆమెను కార్పొరేట్ ఆసుపత్రికి తరలించాలని చెప్పి మరికొంత సొమ్ము కాజేస్తారు. ఇక క్లైమాక్స్‌లో దంపతులను దాదాపుగా బ్లాక్‌మెయిలింగ్ విధానానికి పాల్పడతారు. గర్భాన్ని ధరించడం ఆమె భర్తకు ఇష్టం లేదని, అబార్షన్ చేయమంటున్నాడని చెబుతారు. అతనికి రెండు మూడు లక్షలు ఇవ్వకపోతే ఇబ్బందులు తప్పవని చెబుతారు. చివరి దశలో ఇక ఎందుకు ఇబ్బందులు.. అని వాటిని భరిస్తారు. తరువాత సాధారణ కాన్పు అసాధారణమని, బిడ్డ ఆరోగ్యంగా, బరువుగా ఉన్నాడని.. ఇలాంటి సమయంలో సిజేరియన్ తప్పదని చెబుతారు. తమ బిడ్డ కోసం వేరే మహిళను ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక మళ్లీ రెండు మూడు లక్షలు చెల్లిస్తారు. ఇలా సుమారు ఒక్కొక్క జంట నుంచి 15 నుంచి 30 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తారు.

కానీ ఇదంతా పూర్తిగా మోసపూరితంగా జరుగుతుంది. అసలు సరోగసీయే ఉండదు. పిల్లలను విక్రయించే ముఠాల నుంచిగానీ, నిరుపేదలైన దంపతుల నుంచి పిల్లలను సేకరిస్తారు. వారికి ఒకటి రెండు లక్షలు మాత్రమే ఇస్తారు. ఆ బిడ్డనే భర్త వీర్యంతో జన్మించాడని నమ్మబలికి అందిస్తారు. ఎవరైనా డిఎన్ఏ టెస్ట్ కావాలని చెబితే కాలయాపన చేసి వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. మరింత బలవంతం పెడితే అక్రమంగా తాము సరోగసి చేశామని ఆ కేసులో జైలుకు వెళ్లాల్సి వస్తుందని బ్లాక్‌మెయిల్ చేస్తారు. ఇక రెండో విధానంలో భర్త వీర్యకణాలు సక్రమంగా లేవని చెప్పి వేరే వ్యక్తి వీర్యకణాలు భార్య పిండంలో ప్రవేశపెడతారు. ఇది కూడా ఒక మోసపూరిత చర్య. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకుల నుంచి కాకుండా భిక్షగాళ్ల నుంచి వీర్యాన్ని సేకరిస్తారు. వీరికి వెయ్యి, రెండు వేల రూపాయలు మాత్రమే ముట్టజెబుతారు. ఇలా తప్పుడు మార్గాల్లో సేకరించిన వీర్యాన్ని భార్య పిండంలో ప్రవేశపెట్టి లక్షల రూపాయలు వసూలు చేస్తారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు వీరిపై ఎలాంటి దృష్టి కేంద్రీకరించడం లేదు. హైదరాబాద్‌లోని సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంలో మోసం జరిగిన తరువాత వివిధ ఆసుపత్రుల్లో తనిఖీలు చేసినప్పుడు అక్కడ జరుగుతున్న ఘటనలు చూసి అధికారుల బృందం ఆశ్చర్యానికి గురౌతోంది. స్కానింగ్‌ల నుంచి ప్రతి అంశంలో లోపాలు గుర్తించారు. వైద్య సంస్థలు పేర్కొన్న వైద్యుల జాబితాయే మోసమని తేలింది.

ఇకనైనా ఫెర్టిలిటీ కేంద్రాలపై ప్రభుత్వం తగిన దృష్టి సారించకపోతే మరిన్ని మోసాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

# మార్కెట్ మాయలో జనం విలవిల

సుంకవల్లి సత్తిరాజు

**'మేధావుల మౌనం దేశానికి శాపం' అనే మాట అక్షర సత్యం. ఎప్పుడో ఎవరో గొంతు నుండి వెలువడిన ఈ సత్యం నేటి వ్యవస్థపై అనేక ప్రశ్నలను సంధిస్తున్నది. మౌనం అంగీకార సూచకం అంటారు. మౌనం ఎన్నో ప్రశ్నలు దాగి ఉన్న సంద్రంగా కొంతమంది ఉద్ఘాటిస్తారు. ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు గారి 'నా గొడవ' అనే కవితా సంకలనం ఒక నినాదంగా ఉద్యమించింది.**

'నా గొడవ' ప్రజలందరి గొడవగా, ఒక ఉద్యమ రూపం సంతరించుకున్న విషయం విదితమే. కాళోజీ స్వరం అన్యాయాలపై, అరాచకాలపై సంధించిన శరంలా మారింది. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిదన్న' కాళోజీ గళం ఒక గర్జనలా మారి ప్రజలకు బాసటగా నిలిచింది. ప్రజల్లో చైతన్య స్ఫూర్తి రగిలించింది. మనిషి తనను తాను నిర్మించుకోవాలని, ఊహాజనితమైన శక్తులకు ప్రభావితం కాకూడదని జర్మనీకి చెందిన తత్వవేత్త ఫ్రెడరిక్ నీట్షే ఉద్బోధించాడు.

"ఇతరులను నమ్మడం కంటే తనను తాను నమ్ముకోవడమే ఉత్తమం. ఇతరులను నమ్మితే అధోగతే" అన్న సత్యం తెలుసుకోవడం అత్యంత శ్రేయస్కరం. నీతికి స్థానం లేని వర్తమానంలో అన్యాయాలపై ఎదురించి పోరాటం చేయడమే ఉత్తమం. ఈ ప్రయత్నంలో విజయం సాధిస్తే చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది. ఓటమి పాలైతే రేపటికి అది గుణపాఠంలా మారుతుంది. వర్తమాన వ్యవస్థలో నిజమైన పోరాట పటిమ ప్రదర్శించి, అంకిత భావంతో పని చేసినా ఫలితం కనిపించకపోగా విమర్శలకు, ఈసడింపులకు గురైతే నిస్సహాయత ఆవహించక తప్పదు. అడుగడుగునా అవినీతే తాండవిస్తున్న నేపథ్యంలో చేతి చమురు విదిలిస్తేనే సకల కార్యాలు నెరవేరుతున్న వాస్తవ పరిస్థితులను కప్పిపుచ్చలేం.




ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచమంతా రెక్కలు చాసింది. సాంకేతిక పరిజ్ఞానం సాయం లేకుండా పూట గడవని రోజులొచ్చాయి. రోడ్డు, రవాణా సౌకర్యాలు పెరిగాయి. పూర్వ కాలంలో వస్తువుల రవాణా, విదేశీ ప్రయాణాలు సముద్ర మార్గం గుండా నౌకల ద్వారా కొనసాగింది. ఇప్పటికీ ప్రపంచ వాణిజ్యానికి సముద్ర మార్గాలు, నౌకలే కీలకం. కుగ్రామాలు సైతం సాంకేతిక విప్లవ పరిణామాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. వంద సంవత్సరాల క్రితం ప్రపంచ జనాభా 200 కోట్లు, 50 సంవత్సరాల క్రితం సుమారు 400 కోట్లు, ప్రస్తుత జనాభా 800 కోట్లు దాటింది. జనాభా గణనీయంగా పెరిగింది. పెరిగిన జనాభాకు సరిపడా ఆహారం అవసరం.

నదుల వద్ద నాగరికత వెల్లి విరిసింది. పంటపొలాలు బతుకునిచ్చాయి. ఆకలిని తీర్చాయి. వర్తమాన ప్రపంచంలో ఎన్నో మార్పులు సంభవించాయి. చమురు కోసం పోరాటం, భూగర్భంలో నిక్షిప్తమైన ఖనిజాల కోసం ఆరాటం, ఆయుధాల కోసం ఒప్పందాలు జరుగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో చరిత్ర గతులను మార్చాలనే ఉత్సుకత పెరిగింది. ఎన్నో ఆవిష్కరణలు ప్రపంచాన్ని ముంచెత్తుతున్నాయి. సూపర్ కంప్యూటర్ నుండి క్వాంటం కంప్యూటర్‌ల వరకు ప్రపంచం పరివర్తన చెందింది. టెక్నాలజీ ప్రపంచాన్ని శాసిస్తున్నది.

ఆయుధాలు, అణ్వాయుధాలు యుద్ధాలకు దారితీస్తున్నాయి. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మనిషి స్థానాన్ని రోబోలకు అప్పగిస్తున్నది. కేవలం డబ్బు సంపాదించాలనే ఏకైక ధ్యేయం ప్రపంచాన్ని అధోగతి వైపు నెడుతున్నది. ప్రపంచ గమనంలో వస్తున్న మార్పులన్నీ కొత్త నీరొచ్చి, పాత నీటిని ఆవలికి గెంటుతున్నట్టుగా ఉంది. భువనాన్ని శాసించాలని కొందరు, గగనంలో తిష్టవేయాలని మరికొందరు, రోదసీలో విహరించాలని మరికొందరు,

చంద్రుడిపై నివాసం కోసం కొంతమంది, సూర్యునిపై పరిశోధనలు చేయడానికి ఇంకొంత మంది పోటీ పడుతున్నారు. నిరంతర పరిశోధనలతో వినూత్న ఆవిష్కరణలను ప్రపంచానికందిస్తూ తమ చరిత్రను పదిల పరచుకోవాలనే కీర్తి కండూతీతో ఆధునిక యువతరం భవిష్య పరిణామాలను ఆలోచించడంలేదు. సాంకేతిక ప్రపంచం ఏ కారణం చేతనైనా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడం మొదలు పెడితే ప్రపంచమే స్తంభించిపోయే అవకాశముంది.



కొవిడ్ సమయంలో ఏం జరిగిందో మనం చూసాం. ఆ పరిస్థితులను అనుభవించాం. తిండి లేక అలమటిస్తూ హాహాకారాలు చేసి, కొవిడ్‌తో చనిపోయిన వారి శవాల గుట్టలు సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగామా? గుప్పెడు మెతుకులు దొరక్క మంచినీటితో దాహార్తిని తీర్చుకున్న నాటి అసహాయుల ఆర్తనాదాలు వినలేదా? నాడు జేబునిండా డబ్బున్నా తినడానికి తిండి దొరక్క రోదించిన వారి కన్నీళ్లు చెప్పిన పాఠాలేమిటి? ధనిక, పేద తారతమ్యం మరచి, రోడ్లపై గీసిన గీతలపై క్యూ లైన్లలో నిలబడి నిత్యావసర వస్తువుల కోసం పడిగాపులు పడిన నాటి చేదు అనుభవాలు చెప్పిన సత్యాలేమిటి? వాటి నుండి మనం నేర్చుకున్న గుణపాఠాలేమిటి? ప్రపంచమెంత ముందుకు పరుగెత్తినా, మనిషి ఆలోచనలు ఎన్ని అద్భుతాలను సృష్టించినా కూటి కోసమే కోటి విద్యలన్న పెద్దల మాట యథార్థం. ఈ ప్రపంచంలో అత్యంత భయంకరమైనది ఆకలి.

క్షుద్బాధ తీరిన తర్వాత కూడా తరతరాలకు తరగని సంపదను దోచి, దాచి పెట్టాలన్న స్వార్థ చింతన ఆక్షేపణీయం. కూటి కోసం జీవించే మనం, ఎంత సంపాదించినా, చివరకు అంతా కాటికి పోవలసిందే. శాస్త్ర సాంకేతిక పరంగా ఎన్ని మార్పులొచ్చిలా, భువన గగనాలపై ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నించినా తినడానికి గుప్పెడు మెతుకులు లేని పరిస్థితులు దాపురించిననాడు, ప్రజలకు నిత్యావసర వస్తువులు అందని ద్రాక్షలా, ఆటాడుకున్నప్పుడు ఆహార భద్రత ప్రశ్నార్థకమైననాడు మనం సృష్టించుకున్న కృత్రిమ వ్యవస్థలన్నీ కుప్పకూలక తప్పవు. మనం సాధించిన అభివృద్ధి అక్కరకు రాదు. అధునాతన సాంకేతిక ప్రపంచం ఆకలితో అలమటించక తప్పదు. మానవుడు జీవించడానికి గాలి, నీరు ఎంత అవసరమో, ఆకలి తీర్చుకోవడానికి ఆహారం కూడా అంతే అవసరం. ఆహారం విభిన్న రకాలుగా ఉండవచ్చు. కానీ ఆకలి మాత్రం అందరికీ ఒకటే విధంగా ఉంటుంది. ఈ సమస్త సృష్టిలో అద్భుతమైన మేధస్సు గల మానవుడు ఇతర జీవరాశుల జీవన విధానానికి భిన్నమైన పద్ధతులను నేర్చుకుని, నాణ్యమైన, భద్రమైన జీవన ప్రమాణాలతో ఈ ధరిత్రిపై అత్యధిక కాలం మనగలుగుతున్నాడు. మనుగడ సాగించగలుగుతున్నాడు. మనిషి పోయేవరకు ఆకలి పోదు. నియంతలు ప్రజలను శాసిస్తే ఆకలి ఆ నియంతలను కూడా శాసిస్తుంది. అదే ఆకలి గొప్పదనం. అందుకే ప్రజలు ఆకలితో అలమటించకుండా వారి ఆకలిని తీర్చే నిత్య జీవితావసరాల కోసం ప్రభుత్వాలు ప్రయత్నించడం సమంజసం. వ్యవసాయం ప్రజల ఆకలి తీర్చడానికి అత్యంత అవసరం. కాబట్టి వ్యవసాయాన్ని అనుకూలంగా, లాభసాటిగా మార్చుకోవాలి. నిత్యావసర వస్తువులను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. జన జీవనానికి సంబంధించిన ప్రాథమిక అవసరాలను తీర్చే వివిధ రకాల ఆహార పదార్థాలు, ఔషధాలు, ఇంధనాలు మొదలైన వాటిని నిత్యావసర వస్తువులుగా (essential commodities) పిలుస్తారు.

ఒక్కో దేశంలో, ఒక్కో ప్రాంతంలో ఆహారపు అలవాట్లు వేర్వేరుగా ఉంటాయి. కొన్ని చోట్ల బియ్యాన్ని ఆహారంగా ఉపయోగిస్తే, మరికొన్ని చోట్ల గోధుమలను ముఖ్యమైన ఆహారంగా స్వీకరిస్తారు. కొన్ని చోట్ల కొంతమంది ఆకుకూరలు, కూరగాయలు వంటి శాకాహారాన్ని భుజిస్తే, మరికొన్ని చోట్ల జంతువుల మాంసాన్ని భుజిస్తారు, ఇంకొన్ని చోట్ల శాకాహారంతో పాటు, మాంసాహారాన్ని కూడా భుజించడం అలవాటు. భారతదేశం వంటి ఉష్ణ ప్రాంతాల్లో ఆహారపుటలవాట్లు ఒక విధంగా ఉంటే, కెనడా, రష్యా వంటి శీతల దేశాల్లో ఆహారపుటలవాట్లు మరో విధంగా ఉంటాయి. వాతావరణానికి అనుగుణంగా ప్రజల ఆహారపుటలవాట్లు, జీవన శైలి ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో దక్షిణాది, ఉత్తరాది ప్రజల ఆహారపు అలవాట్లలో వ్యత్యాసముంటుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా తినే ఆహారంలో వైవిధ్యం కనిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ క్షుద్బాధను తీర్చుకోవడానికి ప్రతీ జీవికి ఆహారం అవసరం. ఆహారం నిత్యావసరం. ఇతర జీవరాశులకు, మానవులకు ఆహారపు అలవాట్లు వేర్వేరుగా ఉంటాయి.



కొన్ని జంతువులు ఇతర జంతువులను సంహరించి, వాటి ఆకలిని తీర్చుకుంటుంటే, మరికొన్ని జీవరాశులు ఇతర జీవరాశులపై ఆధారపడి జీవించడం ప్రకృతి ధర్మంగా పేర్కొనడం జరుగుతున్నది. ఆదిమానవుడు అడవుల్లో జీవిస్తూ, జంతువులను వేటాడి పచ్చి మాంసాన్ని భుజిస్తే, ఆధునిక మానవుడు నాగరికత అలవరచుకుని నేర్పుగా వంట చేయడం నేర్చుకుని, రాబోయే కాలానికి లోటు లేకుండా తమ అవసరాలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్త పడుతున్నాడు. తాగడానికి పరిశుభ్రమైన నీరు, నివసించడానికి అనువైన గృహాలు, దుస్తులు, తినడానికి అనువైన ఆహార పదార్థాలు నిత్యావసరాలుగా పేర్కొనవచ్చు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా నిత్యావసరాల్లో కూడా మరికొన్ని అంశాలు చేర్చబడ్డాయి. విద్య, వైద్యం, ఆరోగ్య సంబంధిత అంశాలు కూడా జన జీవితానికి ఆవశ్యకం కాబట్టి ఇవి కూడా ప్రాథమిక మౌలిక సదుపాయాలుగా, నిత్యావసరాలుగా భావించడం జరుగుతున్నది.

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం. 140 కోట్ల జనాభా గల దేశంలో 3.3 మిలియన్ చదరపు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల భూభాగముంది. అమెరికా, కెనడా, చైనాలు భారత్ కంటే సుమారు మూడు రెట్లు అధిక భూభాగం కలిగి ఉన్నాయి. రష్యా భారత్ కంటే సుమారు ఆరు రెట్ల అధిక భూ విస్తీర్ణం కలిగి ఉంది. అయితే చైనా భూభాగంలో కేవలం 10 శాతం మాత్రమే వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. కెనడాలో కేవలం 2 శాతం మంది రైతులు మాత్రమే వ్యవసాయం చేస్తారు.

వాతావరణ మార్పులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపడం ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలను వినియోగించడానికి రైతుల ఆర్థిక స్థోమత సరిపోకపోవడం, ప్రభుత్వంపై సబ్సిడీ భారం పెరగడం కెనడాలో వ్యవసాయం తగ్గుముఖం పట్టడానికి కారణం. భారతదేశంలో రైతులు తరచూ ఆర్థిక ఒడిదుడుకులకు లోనతున్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడమే ఇందుకు కారణం. కొన్ని దేశాలతో పోల్చితే వ్యవసాయ కూలీల వేతనం భారతదేశంలో చాలా స్వల్పమనే చెప్పాలి. అయినప్పటికీ రైతులు ఈ భారాన్ని కూడా మోయలేకపోవడానికి గల కారణాలెన్నో. వ్యవసాయం తగ్గుముఖం పట్టడం, యువత ఉద్యోగాల్లో స్థిరపడడం





వలన భారత్ భవిష్యత్తులో ఆహార సమస్యను ఎదుర్కొనే అవకాశముంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. వ్యవసాయం చేసే రైతులు ఆర్థికంగా చితికిపోతున్నా, వినియోగదారులకు మాత్రం మార్కెట్లో ధరలు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. పంటచేలో లేని ధరలు బయట మార్కెట్‌లోకి వచ్చేటప్పటికి ఎందుకు పెరుగుతున్నాయో ఊహించడం కష్టమేమీ కాదు. దళారుల దందా, మార్కెట్ మాయాజాలం అన్నదాతల కంట కన్నీరు పెట్టిస్తున్నాయి. ఆత్మహత్యల వైపు అడుగులు వేయిస్తున్నాయి.

## భారతదేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి కారణాలు

భారత్‌తో పాటు ఏ దేశంలోనైనా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి ద్రవ్యోల్బణం పెరగడం ప్రధాన కారణం. ద్రవ్యోల్బణ సమస్య కారణంగా భారత్‌లోని పలు రాష్ట్రాల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారడం, పలు కారణాల వలన సప్లై చైన్స్‌లో ఆటంకాలు ఏర్పడడం, ప్రజల జీవన ప్రమాణాలు దిగజారడం, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడం, దళారుల దగాకోరు దోపిడీ విధానాలు, స్వార్థం, అవినీతి, అక్రమంగా నిత్యావసర వస్తువులను వేరే చోటుకి తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి అనైతిక చర్యల వలన భారతదేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది కేరళలో ద్రవ్యోల్బణం రేటు 6.71 శాతంగా నమోదైనది. ఈ కారణం వల్లనే కేరళలో నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్నాయి. కేరళ తర్వాత లక్షద్వీప్, గోవా, పంజాబ్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, అరుణాచల ప్రదేశ్, హర్యానా, మిజోరం, హిమాచల ప్రదేశ్‌లలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంది. ఇన్‌ఫ్లేషన్ వలన ఈ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి.

భారతదేశంలో ఈ సంవత్సరం మే నెలలో ఇన్‌ఫ్లేషన్ రేటు కొంత తగ్గుముఖం పట్టి జూన్ నాటికి 1.72 శాతంగా నమోదైనట్టు కొన్ని గణాంకాల వలన తెలుస్తున్నది. నిత్యావసర వస్తువుల ధరలు దేశంలో గతంలో కంటే తగ్గుముఖం పట్టడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి వస్తున్నట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి.

## భారతీయ సంస్కృతిలో పెనవేసుకున్న బంధం బంగారం



బంగారం నిత్యావసర వస్తువు కాకపోయినా, నిత్యావసర వస్తువు కంటే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. భారతదేశ ప్రజలకు ప్రాచీన కాలం నుండి బంగారమంటే అత్యంత ప్రీతిపాత్రం. భారతీయ సంస్కృతిలో బంగారానికి ప్రాధాన్యమెక్కువ. బంగారంతో వివిధ ఆభరణాలు చేయించుకుని అత్యంత అపురూపంగా భద్రపరచుకునే వారికి నేడు బంగారమంటే ఒక భద్రత, భరోసాగా మారింది. బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల మేలిమి బంగారం లక్ష రూపాయలు దాటింది. ప్రజలు బంగారాన్ని కష్టకాలంలో ఆదుకునే విలువైన ఆస్తిగా భావిస్తున్నారు. భారతీయులు బంగారాన్ని అనవసరంగా దాచుకుంటున్నారనే అపప్రథ తొలగిపోయింది. బంగారం ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. బంగారం కొని భద్రపరచుకుంటే, కొన్నేళ్లలోనే వాటి ధరలు విపరీతంగా పెరగడం వలన బంగారం ఒక ప్రధానమైన ఆదాయ వనరుగా రూపాంతరం చెందింది. బంగారాన్ని అంతరిక్ష పరిశోధనల కోసం అవసరమయ్యే ఉపగ్రహాల్లో, అంతరిక్ష నౌకల్లో, రక్షణ రంగంలో, ఎలక్ట్రానిక్ పరికరాల్లో కండక్టర్‌గాను, వైద్య పరికరాల్లోను బంగారాన్ని వినియోగిస్తున్నారు. భూ వాతావరణానికి, అంతరిక్ష వాతావరణానికి మధ్య చాలా వైరుధ్యముంటుంది. అంతరిక్ష ఉష్ణోగ్రతల నుండి ఉపగ్రహ పరికరాలను కాపాడడానికి బంగారాన్ని వినియోగిస్తారు. ప్రపంచ వాణిజ్యం వివిధ రకాల వస్తు, సేవల ఆధారంగా జరుగుతున్నప్పటికీ, బంగారం కూడా వాణిజ్య రంగంలో కీలక పాత్ర వహించడం విశేషం. ఆర్థిక సంక్షోభ సమయాల్లో బంగారం ప్రాధాన్యతను మరువలేం. కరెన్సీ విలువ పడిపోయినప్పుడు అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల్లో బంగారం ద్వారా లావాదేవీలు జరుపుతారు.

ప్రపంచ దేశాల ఆర్థిక సుస్థిరత్వానికి బంగారం తోడ్పడుతుంది. బులియన్ మార్కెట్ బిలియన్ డాలర్లను కురిపించే ఖరీదైన వ్యవహారంగా మారింది. భారతీయ బ్యాంకుల్లో కొద్ది సంవత్సరాల క్రితం వరకు రైతులకు బంగారం మీద కేవలం 25 పైసలు వడ్డీతో రుణాలను అందించేవారు. ఈ విధానం రద్దు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి పావలా వడ్డీకే బంగారంపై వ్యవసాయదారులకు రుణాలను మంజూరు చేయాలి. భవిష్యత్తులో బంగారం ధరలు మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్న దృష్ట్యా పలువురు ధనికులు భూములపై కాకుండా బంగారంపై దృష్టి సారించడం గమనార్హం.

గత మే నెల నాటికి ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని, ద్రవ్యోల్బణం 14 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నట్టు రెండు నెలల క్రితం కేంద్రం ప్రకటించింది. 2026వ ఆర్థిక సంవత్సరం నాటికి భారత దేశంలో ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని, దీనివలన ప్రజలకు అన్ని రకాల కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు చౌక ధరలకే లభించే అవకాశముందనే సూచనలు కనిపిస్తున్నాయి.

### క్షీణిస్తున్న భారత్ అమెరికా వాణిజ్య సంబంధాలు ప్రజలపై ప్రభావం

భారతదేశం రష్యాతో సన్నిహిత వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలు కలిగి ఉండడంతో రష్యా నుండి చౌకగా చమురును దిగుమతి చేసుకుంటున్నది. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం వలన ఏర్పడిన విపత్కర పరిణామాలతో తీవ్ర ఇంధన సంక్షోభాన్ని చవిచూసింది. అయితే రష్యాతో భారత్‌కున్న చిరకాల మైత్రి వలన రష్యా చమురు దిగుమతుల వలన భారత్ ఇంధన రంగంలో సురక్షితమైన స్థానంలోనే ఉంది. ఆర్థిక మాంద్యంలోను భారత్ నాల్గవ బలమైన ఆర్థిక వ్యవస్థగా మారింది. ఈ పరిణామం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు రుచించడం లేదు. భారత్ చర్యల వలనే రష్యా ఆర్థికంగా పుంజుకుని, ఉక్రెయిన్‌పై సుదీర్ఘ కాలంగా యుద్ధం చేస్తున్నదని, ఇందుకు ప్రతీకారంగా అమెరికా దిగుమతి చేసుకునే భారతీయ వస్తువులపై 25 శాతం సుంకాలను విధించడమే కాకుండా, రష్యా నుండి చమురును, ఆయుధాలను దిగుమతి చేసుకుంటే మరిన్ని వాణిజ్య పరమైన ఆంక్షలను భారత్‌పై విధిస్తానని ట్రంప్ హెచ్చరించడం వలన భారతదేశం ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో వేచి చూడాలి. భారత్ వలన లాభపడుతున్న అమెరికా ఉచ్చనీచాలు మరచి, భారత్‌ను మృత ఆర్థిక వ్యవస్థగా పేర్కొనడం ఆక్షేపణీయం. అమెరికా ఆంక్షలతో భారత్‌లో ఇంధన రంగం కుదేలైతే రవాణాపై కూడా అధిక భారం పడుతుంది. దీని వలన నిత్యావసర సరుకుల రవాణాపై పెను ప్రభావం పడుతుంది. మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే ఆ భారం మోయడం సాధ్యమా?

### నిత్యావసర వస్తువుల చట్టం

1955 నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం భారత ప్రభుత్వం 2007 ఫిబ్రవరి 12వ తేదీన నిత్యావసర వస్తువుల జాబితాలో మరికొన్ని వస్తువులను చేర్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ జాబితా ప్రకారం పండ్లు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను, ధాన్యం, పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను నిత్యావసర వస్తువుల జాబితాలో చేర్చడం జరిగింది. ఎరువులు, ఔషధాలు, పెట్రోలియం ఉత్పత్తులు కూడా నిత్యావసర వస్తువుల జాబితాలోకి వస్తాయి. 1955 ఇసి ఏక్ట్‌లోని కొన్ని సెక్షన్లు నిత్యావసర వస్తువులపై ప్రభుత్వానికి కొన్ని అధికారాలను దఖలు పరచాయి. నిత్యావసర వస్తువుల ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వంటి విషయాల్లో పలు నిబంధనలను చేర్చడం జరిగింది.

నిత్యావసర వస్తువుల నిల్వలపై పరిమితులు విధించడం జరిగింది. ధరల పెరుగుదలను నివారించడానికి, నల్ల బజార్లకు తరలించి కృత్రిమ కొరత సృష్టించే వారిని శిక్షించడానికి చర్యలు తీసుకోబడుతున్నాయి. 1980వ సంవత్సరం నుండి అన్ని రాష్ట్రాల్లోను బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణ చట్టం అమల్లో ఉంది. 1955 నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, నేరస్తులను శిక్షించే అధికారం సంబంధిత అధికారులకుంది.

1966, 1967, 1968, 1970వ సంవత్సరాల్లో కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ చెరకు, చక్కెర నియంత్రణ కోసం సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ప్రజా ప్రయోజనాల కోసం ఈ సవరణలు తదుపరి సంవత్సరాల్లో కూడా కొనసాగుతున్నాయి. 1955 'ఎసెన్షియల్ కమ్మోడిటీస్ ఏక్ట్' అసంబద్ధంగా ఉందనే వాదనలున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడం, ఉత్పత్తి, సరఫరాకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి అమలు జరిపే సుదీర్ఘ ప్రక్రియలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి.



స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశంలో నిత్యావసర వస్తువుల చట్టం అమల్లో ఉంది. 1939 నాటి బూజు పట్టిన చట్టాన్ని 1946లో రద్దు చేయడం జరిగింది. స్వాతంత్ర్యానంతరం అనేక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఇసి ఏక్ట్‌లో పలు మార్పులు చేసి 1955లో సరికొత్త చట్టం చేసినా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సవరణలు జరుగుతూనే ఉన్నాయి.

## నిత్యావసర వస్తువుల చట్టం-శిక్షలు జరిమానాలు

1955 నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 3 కింద జారీ చేయబడిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తే ఆ చట్టంలోని



సెక్షన్ 7 ద్వారా శిక్షలను విధించవచ్చు. సెక్షన్ 7 అక్రమంగా నిత్యావసర వస్తువులను దారి మళ్లించే వాహనాలను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులకు సెక్షన్ 3లోని వివిధ క్లాజుల ప్రకారం సంవత్సరం నుండి మూడేళ్ల వరకు జైలు శిక్ష/జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది. సెక్షన్ 7(1), సెక్షన్ 7 (2), 7(3)లు చట్ట ఉల్లంఘనకు సంబంధించిన పలు రకాల శిక్షలను సూచిస్తున్నాయి.

## నిత్యావసర వస్తువుల చట్టం, వినియోగ దారుల చట్టాలు

నిత్యవసర వస్తువుల చట్టాలు (Essential commodities acts), వినియోగదారుల చట్టాలు ఒకటేనా? అనే మీమాంస సగటు పౌరుల్లో కలగడం సహజం. ఎందుకంటే నిత్యావసర వస్తువులను కొనే వ్యక్తులు కూడా వినియోగదారులే కనుక. ఉభయ చట్టాల లక్ష్యం ఒకటే కనుక. వినియోగదారుల చట్టాలు, నిత్యావసర వస్తువుల చట్టాలు ఒకటే కావచ్చునన్న సందేహం కలగడంలో ఆశ్చర్యం లేదు. వస్తు, సేవలను కొనుగోలు చేసి, వినియోగించే వ్యక్తులను వినియోగదారులుగా నిర్వచిస్తారు.

నిత్యావసర వస్తువుల చట్టాలు, వినియోగదారుల హక్కుల చట్టాలు ఒకటి కాదు. వీటికి వేర్వేరు యంత్రాంగాలున్నాయి. వినియోగదారులను వ్యాపారుల లాభాపేక్ష నుండి కాపాడడానికి వినియోగదారుల చట్టాలు ఏర్పడ్డాయి. అధిక ధరలను నియంత్రించి నిత్యావసర వస్తువులు పక్కదారి పట్టకుండా, సంక్షోభ సమయాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి, ప్రజలకు రక్షణ కవచంలా నిత్యావసర వస్తువుల చట్టాలు రూపొందించబడ్డాయి.

భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. ఒకప్పటి ఆర్థిక అస్థిరత నేడు దేశంలో లేకపోవడానికి భారత్‌లో ఆహార ధాన్యాలకు కొదవ లేకపోవడమే. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందచేయాలి. దళారుల జోక్యాన్ని నియంత్రించాలి. నిత్యావసర వస్తువుల చట్టంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరణలు చేయాలి. ✦

# కుదిరితే కప్పు కాఫీ

సింగిల్ పేజీ కథ

**అప్పుడప్పుడే** తెలతెలవారుతోంది. దినపత్రికలు ఇంటి కాంపౌండ్‌లో పడిన శబ్దం. పాల ప్యాకెట్ వాడు "పాలు" అని అరిచి ప్యాకెట్ పెట్టి వెళ్ళిపోతున్న అడుగుల శబ్దం. పడక మీద మెలకవగా ఉన్న ఫార్మసీ కోర్సు చదివిన కావ్య గుప్పెడు మనసులో బోలెడు ఆలోచనలు.

"ఇంట్లోవాళ్ళు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు కదా కొత్త మనిషితో ఎలాగబ్బా సర్దుకునేది?" అని అర్థంకాక కొద్దిసేపు అటూ ఇటూ దొర్లింది. దొర్లినప్పుడు కాలి వెండి గజ్జెలు గీసుకున్నాయి. మనసు కాళ్ల మీదకు పోయింది.

"పెళ్ళి అయ్యాక కాలి వేళ్లకి వెండి మెట్టెలు ధరించాలా, రాగి మట్టెలు ధరించాలా? ఏవి అందంగా ఉంటాయి? ఏవి కాళ్ళకి మంచిది?" అని ఆలోచించసాగింది.

అది కూడా ఆలోచించి.. ఆలోచించి బోర్ కొట్టి మళ్ళీ టాపిక్ మార్చాలనుకుంది. పక్కకు దొర్లింది. మెడలోని బంగారు గొలుసు గుచ్చుకుంది. "అబ్బా!" అనుకుంది.

"అవును... ఇంత చిన్న గొలుసు గుచ్చుకుంటేనే నొప్పిగా ఉందే... తాళిబొట్టు మరింత పెద్దది కదా! తాళిబొట్టును అప్పుడప్పుడూ తీసిపెట్టవచ్చా... తీసి పెట్టకూడదా? ఈ అనుమానాలను అమ్మను అడగాలంటే మొహమాటం. మరి సమాధానాలు దొరికేదెట్లబ్బా?" అని ఆలోచించింది. గబుక్కున గుర్తుకొచ్చింది తన క్లాస్ మెట్ డెంటిస్ట్ ధరణి.



ఈ మధ్యనే పెళ్లి చేసుకున్న ధరణికి ఫోన్ చేసి అన్ని విషయాలూ అడిగి తెలుసుకుందామని నిర్ణయించుకుంది. చిన్నగా లేచి పడకకు గుడ్ బై చెప్పింది.

ముక్కు మీద కళ్లద్దాల మచ్చలున్నాయి కావ్యకి. అవి పోగొట్టుకోవాలని కలబంద గుజ్జును రాత్రి పడుకునే ముందు మచ్చల మీద రాయడం గుర్తుకొచ్చింది. చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుంది. అద్దంలో ముఖం మీది మచ్చలను చూసుకుంది. కొంచెం కొంచెం తగ్గడం చూసి ఖుషీ అయ్యింది.

అప్పుడే అమ్మానాన్నలు లేచిన చప్పుడు.

"ఆదాయం ఎంత వచ్చినా చాలడం లేదు. నీళ్లలాగా ఖర్చు అయిపోతోంది. నువ్వు ఎక్కువ ఖర్చు పెడుతున్నావంటే నువ్వు ఎక్కువ పెడుతున్నావని.." ఇద్దరి మధ్యనా కీచులాటలు మొదలయ్యాయి.

గబగబా షూస్ వేసుకుని వాకింగ్ బయలుదేరబోయాడు నాన్న సుధాకర్.

"కోపం పక్కన పెట్టి కాఫీ తాగి వెళ్ళండి!" వేడుకుంది అమ్మ నిరీష. చెప్పా పెట్టకుండా తలుపు ధభీమని వేసి వెళ్ళిపోయాడు.

"అత్త మీద కోపం దుత్త మీద చూపడం అంటే ఇదే.." అనుకుంది నిరీష. బాధగా కొద్దిసేపు కూర్చుంది. ఇద్దరి బ్యాంకు పాస్ పుస్తకాలూ ముందర వేసుకుని అటూ ఇటూ తిరగేసింది. పర్సు తెరిచి చూసింది. "ప్రతి నెలా లోటు బడ్జెట్టే. వచ్చేది తెలుస్తోంది, కానీ పొయ్యేది తెలియడం లేదు" చిన్నగా గొణిగింది.

టీపాయ్ మీద ఉన్న తెలుగు దినపత్రికను చేతిలోకి తీసుకుంది. "ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు పెరగనున్నాయి" చదివింది. తల మీద మల్లెల వర్షం కురిసినట్లయ్యింది.

గంట గడిచింది.

ఒంటినిండా చెమట చుక్కలతో అప్పుడే నాన్న ఇంట్లోకి వచ్చాడు.

బ్రష్ చేసుకుంటోంది కావ్య.

నెమ్మదిగా వెళ్ళి అమ్మ పక్కన కూర్చున్నాడు నాన్న.

బుజ్జగింపుగా "కాఫీ" అని అడిగాడు.

ముఖం తిప్పుకుంది అమ్మ .

"వాకింగ్ పార్క్ ముందరున్న కాఫీ కేఫ్‌లో తాగి ఉంటారు. నాకు తెలియదా ఏమిటి? ఆరు నూరైనా, నూరు ఆరైనా కాఫీ తాగకుండా ఉండలేరు కదా మీరు" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది.

చిన్న పిల్లాడిలా ముఖం పెట్టి "నిజమే! కాఫీ టోకెన్ తీసుకున్నాను. తాగాలని ఆశపడ్డాను. కానీ అక్కడ కాఫీ బాలేదు నిరీషా. నువ్వు చేసినంత కమ్మగా, రుచిగా అక్కడ ఉండదు. అందుకే రెండు సిప్‌లు తాగి, నచ్చక ఇంటికి వచ్చేశాను" మెత్తమెత్తగా చెప్పాడు.

నిరీష మనసు సెగ తాగిన పాల లెక్కన పొంగింది. స్ప్రింగు లాగా లేచి వేడి వేడి ఫిల్టర్ కాఫీ చేసుకొచ్చింది.

ఇద్దరూ కూర్చుని కబుర్లాడుతూ కాఫీ తాగుతూ ఉన్నారు. గంట క్రితం పోట్లాడుకున్న వాళ్ళలా లేరు వాళ్ళు. పాత స్నేహితుల్లా నవ్వుతూ, పడీపడీ మాట్లాడుకుంటూ ఉన్నారు. వారిని చూస్తూ ఉన్న కావ్యకు నాన్నలోని బ్యాంకు మేనేజర్ కనిపించలేదు. అమ్మలోని జూనియర్ కాలేజీ లెక్చరర్ అగుపించలేదు.

అయిదు పదులు వయసున్న ఆ జంటను చూసిన కావ్య ముసిముసి నవ్వులు నవ్వుకుంది. "పాలు, డికాషన్‌లు సమపాళ్లలో కలిస్తేనే మంచి కాఫీ అవుతుంది. భార్యాభర్తలు పట్టింపులు లేకుండా, భేషజాలకు పోకుండా, కలిసి మెలిసి పోతేనే మంచి సంసారమవుతుంది. సంసారంలో అప్పుడప్పుడూ గిల్లికజ్జాలు మామూలే! కాఫీలో చక్కెర ఎక్కువ తక్కువలా?" అని తెలుసుకుంది.

**- ఆర్.సి.కృష్ణస్వామి రాజు**

# ఊహల ఊయలలో..!

కోయిలమ్మ గళం విప్పి
కొత్త పాటలు పాడుతుంటేను
వయ్యారాల నాట్యానికై,
మయూరం పురి విప్పుతున్నది.

కులుకు నడకల చిలుకలు
ముద్దుపల్కులు పలుకుతుంటే
గుసగుసలాడే గువ్వజంటలు
గూటికేగుచున్నవి.

మకరందాలను అందించే
మల్లెజాజి మందారాలను చూచి
బంగమూతుల బంతీ
చేమంతులు
పరిమళాల
మురిపాలను
పంచుతున్నాయి.

సహజ వైరం మాని
ఆడుకునే
వన్యప్రాణుల చూచి
కొండకోనల
జలపాతాలు
సెలయేటి గలగలలై
నదులై
ప్రవహిస్తున్నాయి.

ఓలలాడు ప్రకృతి
పచ్చదనాలు సింగారించుకున్న వేళ..



ఊహాగానం చేసే మనసు,
ఊయలలూగుచున్నది.

**- ఏవివి ప్రసాద్ శర్మ**

ఈ వారం కవిత్వం

# ఎందుకు?

మనిషి జీవితం
ఎందుకు? ఏమిటి? ఎలా?
అనే ప్రశ్నలతో మొదలౌతుంది.
ఏ పని చేయాలన్నా
ఎందుకు చేయాలి..? అని
ప్రశ్నించుకుని
ప్రయత్నం ప్రారంభిస్తాం.

మనిషి జీవితం
పోరాటాలమయం.
ప్రతి విషయానికి
స్పందించనవసరంలేదు
విచక్షణ జ్ఞానమే
నీకార్యాచరణకు
సాధనం కావాలి.

సమస్యలకు వెరువక
పరిష్కారమే ధ్యేయంగా
ప్రగతియే మార్గంగా
పురోగతియే లక్ష్యంగా
అభివృద్ధియే ప్రణాళికగా
వివేచన విచక్షణే మార్గంగా

పని చేసే సామర్థ్యం
పెంచుకుంటే ప్రగతి
నీ వశమవుతుంది.
సమస్యలు పరిష్కారమై
జీవితం సఫలమోతుంది
మానవుడా మేలుకో!
ప్రగతి పదాన్ని ఏలుకో!!

**- నేదునూరి కనకయ్య**

# దృశ్య మాలికలు

రేపటి రోజు కొరకు
మనసులో
ఎదురు
చూస్తాను
ఈరోజు
గడిచి
గతమైతే
మళ్లీ రాదని
బాధపడతాను !

మారుతున్న రోజుల మధ్యన
నిన్నటి రేపటి ఆలోచనలతో అలసి!
జారే నీడలే తనను మారుస్తాయని
అనుకోదు ఏ రోజు!

ఏ రోజుకు ఆ రోజు కొత్తగా
అనుకున్నంతనే మారిపోవు నిన్నటిగా!
రోజును నిన్న రేపటులుగా
మారుస్తున్న వెలుగు నీడలు!

రేయింబవళ్ళు
తెర ఎత్తి దించే
దృశ్య మాలికలు!
రేయి పవలు ఏవో
పలవరింతలు
రోజు రోజు రేపటి
కలవరింతలు!

నిలకడ లేని రోజులో ఉండి
పగలే కల గంటాను.. మనసులో
రేపటి రోజు నిజమవ్వాలని
రోజు రోజు అనుకుంటాను!

వెలుగు నీడలు రోజులై
సాగిపోతుంటే
ఆశగా రేపటి కొరకు
ఎదురు చూస్తాను!

**- పి.బక్కారెడ్డి**

# నవ్వు

స్వచ్ఛమైన నీ నవ్వు
స్నేహంతో చూసే నీ చూపు
నిండైన నీ రూపు
నడిచే మానవత్వమా!

నను నడిపించే
నిత్య చైతన్యమా!

సుదూర తీరంలో నీవు..
యాంత్రిక జీవనంలో నేను
ఎప్పటికి కలుసుకోలేని
సమాంతర రేఖలం మనం



అయినా
నిరంతరం
నీ ఆలోచనలతో
జీవించే నీ నేస్తం!!

**- డా॥ ఎన్.నిశ్చల**

# పులిహోర రుచులు

## కొబ్బరి పులిహోర



### కావలసిన పదార్థాలు

అన్నం: రెండు కప్పులు; నూనె-పావు కప్పు; ఆవాలు-అర చెంచా; సెనగపప్పు-ఒక చెంచా; మినప్పప్పు-చెంచా; పల్లీలు-పావు కప్పు; ఇంగువ-పావు చెంచా, పసుపు-కొద్దిగా; కరివేపాకు రెబ్బలు-నాలుగు; ఎండుమిర్చి-మూడు; కొబ్బరి తురుము-కప్పు; నానబెట్టిన చింత పండు-నిమ్మకాయంత; పచ్చిమిర్చి-మూడు; జీలకర్ర-చెంచా; బెల్లం-చిన్న ముక్క; కొత్తిమీర తరుగు-పావు కప్పు; ఉప్పు-తగినంత.

### తయారు చేసే విధానం

ముందుగా కొబ్బరి తురుము, నానబెట్టుకున్న చింతపండు, పచ్చిమిర్చి, జీలకర్ర, బెల్లం, కొత్తిమీర తరుగు, సగం కరివేపాకు, తగినంత ఉప్పును మిక్సీలో వేసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. స్టవ్ మీద కడాయిని పెట్టి నూనె వేయాలి. అది వేడెక్కాక ఆవాలు, సెనగపప్పు, మినప్పప్పు, పల్లీలు, ఇంగువ, ఎండుమిర్చి వేసి అన్నింటిని చక్కగా వేయించాలి. ఈ తాలింపు వేగాక పసుపు, మిగిలిన కరివేపాకు వేయించి స్టవ్‌ని ఆఫ్ చేయాలి. పోపు వేడిగా ఉన్నప్పుడే ముందుగా చేసి పెట్టుకున్న కొబ్బరి మిశ్రమాన్ని కడాయిలో వేసి రెండు నిమిషాలు వేయించుకోవాలి. చివరగా ఈ మిశ్రమం మొత్తాన్ని అన్నం పైన వేసి బాగా కలపాలి.

## పెప్పర్ రైస్

### కావలసిన పదార్థాలు


అన్నం: పెద్ద కప్పు; చింతపండు-నిమ్మకాయంత; ఎండు మిర్చి-నాలుగు, మిరియాలు-ఒకటిన్నర చెంచా; ఆవాలు-ఒక చెంచా; సెనగపప్పు-టేబుల్ స్పూను; మినప్పప్పు-ఒక స్పూను; పల్లీలు-పావుకప్పు; బెల్లం తురుము-అరచెంచా; పసుపు-కొద్దిగా; కరివేపాకు రెబ్బలు-రెండు; ఉప్పు-తగినంత; నువ్వుల నూనె-తగినంత; ఇంగువ-పావు స్పూను; పచ్చి మిర్చి-ఒకటి.

### తయారు చేసే విధానం



ముందుగా చింతపండును వేడి నీటిలో నానబెట్టుకుని ఆ తరువాత చిక్కని రసం తీసుకోవాలి. మిరియాలు, రెండు ఎండు మిరపకాయలను దోరగా వేయించి, పొడి చేసి సిద్ధంగా వుంచుకోవాలి. స్టవ్ మీద కడాయిని పెట్టి నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, సెనగపప్పు, పల్లీలు, మిగిలిన ఎండుమిర్చి, కరివేపాకు, పచ్చిమిర్చి, ఇంగువ వేయించుకుని చింతపండు గుజ్జు వేయాలి. ఇది ఉడుకుతున్నప్పుడు పసుపు, తగినంత ఉప్పు, సిద్ధంగా పెట్టుకున్న మిరియాల పొడి, బెల్లం తురుము వేసి కలిపి రెండు నిమిషాలయ్యాక స్టవ్ మీద నుండి దింపేయాలి. ఈ మిశ్రమాన్ని అన్నంపైన వేసి చక్కగా కలిపితే మిరియాల పులిహోర సిద్ధం.

## ఉసిరికాయ పులిహోర



### కావలసిన పదార్థాలు

అన్నం: పెద్ద కప్పు; ఉసిరికాయ తురుము: అరకప్పు; నూనె-పావు కప్పు; ఉప్పు: తగినంత; పసుపు-చిటికెడు; ఇంగువ: పావు చెంచా; ఎండు మిరపకాయలు-రెండు; పచ్చి మిరపకాయలు-మూడు; కరివేపాకు రెబ్బలు-రెండు; సెనగపప్పు-చెంచా; మినప్పప్పు-చెంచా; జీడిపప్పు-పావు కప్పు, ఆవాలు-చెంచా; జీలకర్ర -చెంచా; నువ్వుల పొడి-చెంచా; పల్లీలు-పావు కప్పు.

### తయారు చేసే విధానం

స్టవ్ మీద కడాయిని పెట్టి నూనె వేసి ఎండుమిర్చి, ఇంగువ, సెనగపప్పు, మినప్పప్పు, జీడిపప్పు, ఆవాలు, జీలకర్ర, పల్లీలను వేయించుకోవాలి. తరువాత పచ్చిమిర్చి తరుగు, ఉసిరికాయ తరుగు, కరివేపాకు వేసి మరోసారి వేయించాలి. రెండు నిమిషాల తరువాత పసుపు, తగినంత ఉప్పు, నువ్వుల పొడి వేసి కలిపి దించాలి. చల్లారిన తరువాత ఈ మిశ్రమాన్ని అన్నంపైన వేసి బాగా కలిపితే ఉసిరికాయ పులిహోర రెడీ.

# ‘ఆర్యభట్ట’ నుంచి ‘గగన్‌యాన్’ వరకు..

అడవులలో నివసించే ఆదిమానవుల కాలం నుంచి అంతరిక్ష పరిశోధనా యాత్రల్లో దూసుకుపోతున్న నేటి కృత్రిమ మేధ యుగం వరకు విశ్వావిర్భావం, బిగ్ బ్యాంక్ థియరీ, డార్క్ మ్యాటర్, నక్షత్రాల, గ్రహాల గమనాల తదితర అంశాలకు సంబంధించి మానవుని అన్వేషణ, ఆసక్తి, అభిరుచి, జ్ఞాన శోధన, పరిశోధనల ప్రయత్నాల పరంపర వంటివి ఆగకుండా, అలుపన్నది లేకుండా కొనసాగుతూనే వుంది. ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా 2025 జూన్ 25న అంతరిక్షంలోకి వెళ్లి, తదనంతరం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ప్రవేశించిన మొదటి భారతీయుడుగా చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లా జూన్ 28, 2025 నాటి తన డైరీలో రాసుకున్న అంతరంగపు అక్షర పరిమళ సొబగులను ఓసారి గమనిస్తే- ఈ రోజు నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన రోజు. మన ప్రధాని మోడీజీతో వీడియో కాల్‌లో మాట్లాడాను. వారు- “భూమి మీద నేను, ఐఎస్ఎస్‌లో మీరు భారత జాతీయ పతాకాన్ని అంతరిక్ష కేంద్రంలో ఎగురవేశారు” అని మోడీజీ అన్నప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. అదే మాట వారితో అన్నాను. ఈ ఘనత నా ఒక్కడిదే కాదు 140 కోట్ల మంది భారతీయులది అని. అందుకు మీరు మాతృభూమికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది భారతీయుల హృదయాలకు దగ్గరగా ఉన్నారని మోడీజీ అన్నారు. ఆ మాట నా హృదయాన్ని తాకింది. నన్ను భావోద్వేగానికి గురిచేసింది”.

ఇలా సాగిన మోడీ శుక్లా సంభాషణ సందేశంతో భవిష్యత్ భారత పునాదులన్నీ వికసిత్ భారత్‌లో లక్ష్యంగా అంతరిక్ష ప్రయోగ విజయాల కృషికి ముడిపడి ఉందనేది మనమంతా అంగీకరించాల్సిన విషయం.



ఎన్నో శతాబ్దాలుగా మానవ నాగరికత పరిణామ క్రమంలో రాత్రిపూట ఆకాశ వీధుల్లో కనిపించే ఎన్నో అద్భుతాలు ‘అంతరిక్ష అయస్కాంతం’లా మనిషి కెమెరా కంటిని ఆకర్షిస్తూనే వున్నాయి. చిన్నప్పుడు పిల్లలు తినడానికి మారాం చేస్తే అమ్మ “చందమామ రావే, జాబిల్లి రావే” అని చందమామను చూపిస్తూ మాటలతో మరిపిస్తూ, మురిపిస్తూ గోరు వెన్నెల ముద్దలు తినిపించే స్థాయి నుంచి జాబిల్లి ఉపరితలాన్ని స్పర్శించే స్థాయికి ఎదిగింది మానవ మేధస్సు, కృషి. త్వరలోనే మన అమ్మలందరూ నవ్యతరపు జోల పాట చందమామ ఉపరితలంపై పాడే రోజులు రాబోతున్నాయి. చుక్కల్లో జాబిల్లి మనకు ఎప్పటికీ ప్రత్యేకమే. మనకు లభించిన సహజ ఉపగ్రహం మన ‘చందమామే’.

నేడు మన 140 కోట్ల మంది గుండె చప్పుడై వినిపిస్తున్న భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్ 3 మిషన్‌లో భాగంగా 2023, ఆగస్టు 23న సాయంత్రం 6:04 గంటలకు యావత్ ప్రపంచం ఆసక్తితో చూస్తుండగానే ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధృవానికి సమీపంలో సురక్షితంగా సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. ఆ క్షణాన ప్రతి భారతీయుడి గుండె వందేమాతరం నినాదంతో సగర్వంగా మన త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేసింది. ఆ తర్వాత ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటికొచ్చి చంద్రుని ఉపరితలాన్ని పరిశీలించి, పరిశోధించి శాస్త్రీయ సమాచారాన్ని మన శాస్త్రవేత్తలకు పంపించింది. ఒక హాలీవుడ్ సినిమా నిర్మాణం కంటే తక్కువ ఖర్చుతో భారత్ చేసిన ఈ ప్రయోగం చంద్రయాన్3 మిషన్ సాయంతో చంద్రునిపై అడుగుపెట్టిన నాల్గవ దేశంగా, చంద్రుని దక్షిణ ధృవానికి సమీపంలో సురక్షితంగా చేరిన మొదటిదేశంగా నవచరిత్ర సృష్టించింది.

ఈ సందర్భంగా మన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల అసామాన్యమైన కృషిని ఆగస్టు 26, 2023న మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మనందరి తరపున కొనియాడారు. ఆ సందర్భంగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి ‘శివశక్తి’ అని నామకరణం చేసి ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించారు. తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం ఆగస్టు 23,2024ను పురస్కరించుకుని దాదాపు నెల రోజుల నుంచి దేశవ్యాప్తంగా మన అంతరిక్ష విజయాలు, మన శాస్త్రవేత్తల ప్రయాణం, రోదసికి నేటి సాంకేతికత అనుసంధానం, అప్లికేషన్లు వంటి ఎన్నో విషయాలకు సంబంధించిన అంశాలపై వివిధ ప్రదర్శనలు, విద్యాసంస్థల్లో క్విజ్ పోటీలు తదితర కార్యక్రమాలతో భారత ప్రభుత్వం, ఇస్రో వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలతో కలిసి విద్యార్థుల్లో ‘స్పేస్’ స్ఫూర్తిని నింపింది. వారిలో ఆసక్తిని పెంచి భవిష్యత్‌లో ప్రముఖ స్పేస్ శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కృషి చేసింది. ఇప్పుడు రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం, ఇస్రోల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులే కేంద్రంగా "Aryabhata to Gaganyan: Ancient wisdom to infinite possibilities" అనే థీమ్‌తో రెండు వారాల పాటు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతోంది. సైన్స్ ఫెయిర్లు, ఇస్రో శాస్త్రవేత్తలతో ఇంటరాక్టివ్ సెషన్లు,

ప్లానిటోరియం ప్రదర్శనలు, పాఠశాలలు, కళాశాలల్లో వివిధ ప్రతిభా పోటీలు వంటి ప్రణాళికలు ఉన్నాయి.

చంద్రయాన్3 మిషన్‌లో భాగంగా భారత అంతరిక్ష కార్యక్రమ పితామహుడు, విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త పద్మవిభూషణ్ విక్రమ్ సారాభాయ్ జ్ఞాపకార్థం, గౌరవార్థం ల్యాండర్‌కు విక్రమ్ అనే పేరు పెట్టి ఈ అవని పైనే కాక అంతరిక్షంలో సైతం మన విక్రముడి కీర్తిని యావత్ ప్రపంచానికి ఘనంగా చాటింది మన దేశం.



1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ 'స్పుత్నిక్' ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తు అంతా అంతరిక్ష పరిశోధనా ప్రయోగాలతోనే ముడిపడి వుందని గమనించి మన దేశంలో వున్న పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత వంటి మహమ్మారులను ఈ దేశం నుంచి తరిమేయాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రగామిగా వుండాలనీ, మన దేశంలోని సామాన్యుల చెంతకు సాంకేతిక పరిజ్ఞానం చేరినప్పుడే మనం అభివృద్ధి చెందిన దేశంగా వుండగలమనీ బలంగా విశ్వసించారు విక్రమ్ సారాభాయ్. తన అంతరిక్షపు ఆలోచనలను అప్పటి ప్రధాని నెహ్రూతో చర్చించి వారిని ఒప్పించి, మరో విఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త, భారతీయ అణ్వాస్త్ర రంగ పితామహుడు హోమి జె.బాబా పర్యవేక్షణలో 1962లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. అది 1969లో నేటి భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో'గా ఆవిర్భవించింది.

కాలక్రమంలో ఉపగ్రహాల భాగాలను దేశీయంగా తయారు చేసుకుంటూ తద్వారా ఉపగ్రహ వాహక నౌకలను కూడా తయారు చేసే స్థాయికి ఎదిగాం. చాలా తక్కువ ఖర్చుతో ఎన్నో అసాధారణమైన ప్రయోగాలు చేసి అగ్రరాజ్యాలకు సైతం శాస్త్రీయంగా సవాళ్ల విసిరాం.1975 ఏప్రిల్ 19 సోవియట్ యూనియన్ నుండి మన మొదటి శాటిలైట్ 'ఆర్యభట్ట'ను విజయవంతంగా ప్రయోగించాం. ఏప్రిల్ 19,2025 నాటికి ఆర్యభట్ట ప్రయోగ విజయానికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఘనంగా స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకున్నాం. 1980లో ఎస్ఎల్‌వి3 రాకెట్ ద్వారా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రోహిణి-1 ఉపగ్రహాన్ని మన దేశం నుంచే ప్రయోగించి మనసత్తా చాటాం. ఇక అప్పటి నుంచి ఎన్నో ఘన విజయాలు సాధించాం.

అప్పుడప్పుడు దేశీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో విమర్శలు, అవమానాలు, అవరోధాలు, వైఫల్యాలు ఎదురైనా నిరాశ చెందకుండా, పట్టుదలతో అంతరిక్ష ప్రయాణం అనంత విశ్వాన్వేషణ హద్దులతో ఎన్నో లక్ష్యాలతో విజయవంతంగా కొనసాగుతూనే వుంది. పియస్ ఎల్‌వీ, జియస్ఎల్వీ, భారతీయ అత్యంత బరువైన రాకెట్ వాహక నౌక మార్క్ 3 (ఎల్‌వీఎమ్3), చంద్రుని పరిశోధనే లక్ష్యంగా చంద్రయాన్ 1,2,3 మిషన్‌లతో పాటు మొదటి ప్రయత్నంలోనే అంగారక గ్రహానికి సంబంధించిన విజయవంతమైన ప్రయోగం(2014) మంగళయాన్, సూర్యుని ఉపరితలం రహస్యాన్వేషణే లక్ష్యంగా ఆదిత్య ఎల్ 1 మిషన్, ఆస్ట్రో శాట్ మిషన్, ఉపగ్రహాలను అనుసంధానించే డాకింగ్ ప్రయోగం వంటి ఎన్నో స్పేస్ విజయాలతో మన జాతీయ పతాకాన్ని అంతర్జాతీయ అంతరిక్ష వేదికలపై రెపరెపలాడించాం. పాములను ఆడించే దేశం అని ఒకప్పుడు అవమానించబడ్డ మనమే అంతరిక్ష రాకెట్ ప్రయోగాలను శాసించే స్థాయికి ఎదిగాం వేరే దేశాల సాయంతో సైకిల్‌పై ఉపగ్రహాల విడి భాగాలు మోసుకెళ్ళి ప్రయోగాలు చేసిన మనం ఒకే రాకెట్‌లో 104 ఉపగ్రహాలను పంపించి నేడు అంతరిక్ష వ్యాపారంలో దూసుకెళ్తున్నాం. "స్పేస్ నుంచి ఇండియా ఎలా కనిపించిందని?" ఇందిరాగాంధీ రాకేశ్ శర్మను అడిగితే "సారే జహాసే అచ్ఛా" అంటూ ఆయన బదులిచ్చారు.

ఒకసారి మనం చరిత్రను పరిశీలిస్తే భారతదేశం ప్రపంచ విజ్ఞానానికి గణితం, వైద్యశాస్త్రంతో పాటు ఖగోళ శాస్త్రంలో కూడా తన కృషిని అందించింది. కానీ వీటి అభివృద్ధి కొన్ని అంశాలలో కొంత కాలం పాటు మాత్రమే సాగి ఆ తర్వాత కొనసాగలేకపోయింది. మధ్య యుగంలోనే భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుల్లో ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, మహావీర, వరాహమిహిర, భాస్కర అతి విశిష్ట ప్రజ్ఞావంతులు. ఆర్యభట్టీయం పుస్తకం భారతీయ ఖగోళ శాస్త్రానికి పునాదైంది. సూర్యచంద్ర క్యాలెండర్, 1724లోనే జంతర్ మంతర్ ఖగోళ పరిశీలన కేంద్రం వంటివి మన చరిత్రకు సాక్ష్యాలు. స్వాతంత్ర్య భారతంలో కూడా విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్, అబ్దుల్ కలామ్, మాధవన్ నాయర్ లాంటి విఖ్యాత శాస్త్రవేత్తల కృషి అమోఘం.

మన దేశం అంతరిక్ష యాత్రల విజయాలను ప్రదర్శించడానికి, యువతను ప్రేరేపించడానికి మన ప్రభుత్వం తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 సందర్భంగా 'చంద్రుని తాకేటప్పుడు జీవితాలను తాకడం: భారతదేశం అంతరిక్ష సాగా' అనే థీమ్‌తో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. ప్రస్తుత ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మానవ సహిత అంతరిక్ష యాత్రకు సంబంధించిన గగనయాన్, చంద్రయాన్ 4,5 వంటి ప్రయోగాల గురించి ప్రకటించడం జరిగింది.

భవిష్యత్తులో మన అంతరిక్ష ప్రయోగాలన్నీ విజయవంతం కావాలని ఆశిద్దాం. భారతరత్న అబ్దుల్ కలాం అన్నట్లు "ఆకాశంలోకి నక్షత్రాలను అందుకోవడం లక్ష్యంగా పెట్టుకోండి. ఆ సంకల్పం మీలో బలంగా వుంటే ఏదో ఓ రోజు ఆ నక్షత్రాలే మీ పాదాక్రాంతమవుతాయి" వంటి స్ఫూర్తి వచనాలతో భవిష్యత్తు యువతరం కలాం స్వప్నాలుగా, మన దేశ పౌరసత్వం నుంచి నోబెల్ బహుమతులు గెలవగల సి.వి.రామన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలుగా చూడాలని ముందుకు సాగుదాం.

– ఫిజిక్స్ అరుణ్‌కుమార్

కథ

# అక్కరకు రాని సొత్తు

ఒకప్పుడు, కోటీశ్వరుడైన ఓ పిసినారి ఉండేవాడు. తన సంపదను పెంచుకోవడమే తప్ప ఎవరికీ పైసా కూడా దానం చేసేవాడు కాదు. ఒకసారి అతడు ఒక ముఖ్యమైన పని నిమిత్తం రైల్లో ప్రయాణించవలసి వచ్చింది.

అప్పుడు అతని సూట్‌కేస్ నిండా కట్టలకొద్దీ డబ్బుంది. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి రైలు పట్టాలపై నీరు ఉప్పొంగి, అతడు ప్రయాణించే రైలు ఆగిపోయింది. నాలుగు రోజుల పాటు వర్షం తెరిపివ్వకపోవడంతో ప్రయాణికులందరూ ఆకలితో అలమటించారు. కోట్లాది రూపాయలున్నా, పిసినారి ధనవంతుడికి ఒక్క మెతుకు కూడా దొరకలేదు.



చివరికి వర్షం తగ్గగానే, దూరంగా పొగ కనిపించడంతో ఆకలితో ఉన్న వారందరికీ ఆశ చిగురించింది. పిసినారి ధనవంతుడు తనకున్న కొద్దిపాటి బలంతో, సూట్‌కేస్‌ను పట్టుకుని, నడుము లోతు నీటిలో నడుచుకుంటూ ఆ పొగ వస్తున్న చోటుకు చేరుకున్నాడు.

అక్కడ ఒక వృద్ధ బిచ్చగత్తె గంజి కాచుకోవడం చూసి “అమ్మా, నా దగ్గర కోట్ల రూపాయలు ఉన్నాయి. నా ఆకలి తీర్చడానికి ఒక్క గంటెడు గంజి ఇవ్వు, ఈ డబ్బు మొత్తం నీకు ఇస్తాను” అని దీనంగా వేడుకున్నాడు.

ఆమె జాలిపడి “నాయనా, నీ ఆకలి తీర్చలేని ఈ డబ్బు నాకెందుకు? నీకు ఈ గంజి చాలా అవసరం” అని ప్రేమగా గంజి నింపిన పాత్రను అందించింది.

బిచ్చగత్తె ఇచ్చిన గంజి తాగిన తర్వాత ఆ ధనవంతుడికి జ్ఞానోదయం కలిగింది. కోట్లు ఉన్నా ఆకలి తీరదని, కానీ ఆ బిచ్చగత్తె ఇచ్చిన ఒక గిన్నె గంజి ప్రాణం నిలబెట్టిందని గ్రహించాడు. నిజమైన సంపద దానం చేయడంలోనే ఉంది.. అని తెలుసుకున్నాడు.

ఆ రోజు నుండి అతని మనసు మారిపోయింది. తన పిసినారితనాన్ని విడిచిపెట్టి, తన సంపద మొత్తాన్ని పేదలకు, అనాథలకు దానం చేశాడు. దానధర్మాలు చేస్తూ, మానవత్వ విలువలను గ్రహించి, నిజమైన ఆనందాన్ని పొందసాగాడు.

**- డా॥ పోతగాని సత్యనారాయణ**

**మంచిమాట**

చేసేది చెప్పకు. చేసాక చెప్తే గొప్పగా ఉంటుంది. ఫలితం మంచిదైతే ఆచరణాత్మకంగా ఉంటుంది.





## బాలగేయం

### రామచిలుక

చిన్న రామచిలక ఉన్నది
ప్రకృతిలో ఆటాడుతున్నది
వేసిన జామ పండు తిన్నది
వలలో చిక్కుకున్నది.

పంజరాన రామచిలుక
పాట పాడలేనన్నది
ఆకాశాన ఎగిరితేనే
ఆటపాటలన్నది.

జోస్యం చెప్పమంటు
బందీగా అయినది
రెక్కలు విరిచి వేయ
దిక్కుతోచకున్నది.

జాతకాలు తెలిసి ఉంటే
నేనెలా దొరుకుతానన్నది.
నా జాతకం బాగా లేక
బందీగా చిక్కానన్నది.
నా జాతకమే బాగలేదు
జాతకమెలా చెపుతానన్నది.

ఆకశాన స్వేచ్ఛగా
వదిలివేయమన్నది
జాతకాన్ని నమ్ముకోకు
జీవితాన్ని బలి చేసుకోకన్నది
స్వయంకృషే విజయానికి
పరమపద సోపాన మన్నది.

**– ఆవుల చక్రపాణి యాదవ్**

## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

కె.సుకథ, నల్గొండ

**ప్రశ్న: పూర్వ కాలంలో అబాకస్‌తో లెక్కలు ఎలా చేసేవారు?**

**జవాబు:** అరబిక్ అంకెలు వాడకంలోకి రాకముందు అబాకస్‌తోనే లెక్కలు చేసేవారు. మొదటిసారిగా చైనా దేశీయులు దీనిని సువాపాన్ అని పిలుచుకునేవారు. అబాకస్‌తో పోలికలు ఉన్నదానినే క్రీ.పూ.2400 ప్రాంతంలో బాబిలోనియన్‌లోని ప్రజలు ఉపయోగించారని తెలుస్తోంది. ఒక రాతిపలక మీద ఇసుకరాశిని పోసి దాని మీద గీతలు గీసి, చిన్న చిన్న గులకరాళ్లను ఆ గడులలో వేసి లెక్కలు గణన చేసేవారు. దాని నుంచి అబాకీ అనే కొత్త రకం లెక్కల గణింపు ప్రారంభమైంది. రెండు భాగాలుగా ఉండే దానిలో మీద వున్న ఊసలకు రెండు, కింది వాటికి 5 పూజలు ఉండేవి. అబాకస అన్న పదం గ్రీక్ పదమైన అబాక్స్ (లెక్కల బల్ల) నుంచి 1387లో ఆవిర్భవించింది.

**ఎస్.కార్తిక్, శుచీంద్రం**

**ప్రశ్న: హిమాలయాలు ఏర్పడక ముందు అక్కడ ఏమి వుండేది?**

**జవాబు:** మన దేశానికి ఉత్తర దిశగా వున్న హిమాలయాల భాగంలో అతి ప్రాచీన కాలంలో టెథీస్ సముద్రం ఉండేది. ఈ కారణంతోనే టిబెటన్(టెథీస్) హిమాలయాలని ఒక దిశగా వున్న వాటిని పిలుస్తారు. మిగిలినవి గ్రేటర్ హిమాలయాలు (హిమాద్రి), లెస్సర్ హిమాలయాలు (హిమాచల్) శివాలిక్ కొండలు. ఉత్తర దక్షిణాలుగా నాలుగు సమాంతర పర్వత పంక్తులతో హిమాలయాలు కూడి వుంది.





# ఆదరణే ఔషధం

**చదువుల** ఒత్తిడికి 13 యేళ్ల బాలిక బలయ్యింది. చదువులో వెనుకబడ్డాననే బాధ భరించలేక 17వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఓ ప్రైవేటు స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. "బాలిక సరిగ్గా చదవడం లేదని" పేరెంట్స్ సమావేశంలో టీచర్లు ఆమె తల్లికి చెప్పారు. విషయం తెలిసిన తండ్రి "బాగా చదువుకోవాలని" ఆ రాత్రి హితోపదేశం చేశారు. తరువాత గదిలోకి వెళ్లిన బాలిక వాష్ రూమ్ కిటికీ నుంచి దూకింది. అంత ఎత్తు నుంచి కింద పడటంతో శరీరం రెండు ముక్కలైంది.

గత పదేళ్లలో విద్యార్థుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయి. గత ఏడాది దేశంలో 13,500 మందికి పైగా విద్యార్థులు బలవన్మరణానికి గురయ్యారు. సాధారణ ఆత్మహత్యలు రెండు శాతం పెరగ్గా విద్యార్థుల ఆత్మహత్యలు నాలుగు శాతం పెరిగాయి. ఇది జాతీయ సగటు కంటే రెట్టింపు. మొత్తం ఆత్మహత్యల్లో మగ విద్యార్థులు 53 శాతం ఉన్నారు. అయితే గత రెండేళ్లలో మగ విద్యార్థుల ఆత్మహత్యలు ఆరు శాతం తగ్గగా, మహిళా విద్యార్థుల ఆత్మహత్యలు ఏడు శాతం పెరిగాయి. విద్యార్థుల ఆత్మహత్యలకు చదువుల ఒత్తిడే ప్రధాన కారణం. ప్రేమ వైఫల్యాలు, ఇతర కారణాలు కనిపిస్తాయి. అయితే ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 90 శాతం డిప్రెషన్‌తో బాధపడుతున్నవారు ఉన్నారని అధ్యయనాలు తెలిపాయి. ఇందులో కొందరు మాదక ద్రవ్యాల వ్యసనపరులు ఉన్నారు. ఇటీవల జాతీయ సర్వే సంస్థ చేపట్టిన అధ్యయనంలో 16 శాతం విద్యార్థులు నిరాశతో ఉన్నట్టు వెల్లడయ్యింది. మానసిక ఒత్తిడి, ఇతర సమస్యలతో బాధపడేవారు మరింత మంది ఉన్నారు. అయితే అతి తక్కువ మంది తీవ్ర స్థాయి ఒత్తిడి లేదా డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విరామం, విశ్రాంతి, సరదాలు లేకపోవడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందలేకపోతున్నారు. పోలికలు, అవహేళనలు, అవమానం, చులకనచూపు ఎదురైనపుడు మరింత కుంగుబాటుకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. ఆత్మహత్యలకు పాల్పడే వారిలో దాదాపు అందరిలోను బతకాలనే కోరిక ఉంటుంది. అయితే ప్రత్యామ్నాయ మార్గం లేక తట్టుకోలేక బలవన్మరణానికి గురవుతుంటారు.



**ఆదరణే ఔషధం:** ఆత్మహత్యా భావన ఉన్నవారిని సులభంగా గుర్తించవచ్చు. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటారు.. అన్న భావనలో వాస్తవం లేదు. కొద్ది రోజులుగా తీవ్రమైన మానసిక ఒత్తిడి, డిప్రెషన్‌తో బాధపడుతున్నవారు మాత్రమే ఆత్మహత్య చేసుకుంటారు. అయితే ఆత్మహత్యకు ముందు ఎదురయ్యే ప్రతికూల సంఘటన/సమస్య ప్రకోపానికి కారణం అవుతుంది. ఆత్మహత్యకు పాల్పడేవారి ప్రవర్తనలో ముందు నుంచే మార్పు కనిపిస్తుంది. నిరాశ, నిస్పృహలు వ్యక్తం చేస్తుంటారు. నిద్ర, ఆహార సమస్యలకు గురవుతుంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలవడం తగ్గిస్తారు. ఒంటరిగా ఉండటానికి ఎక్కువ ఇష్టపడతారు. వేదాంత ధోరణిలో మాట్లాడటం ప్రారంభిస్తారు. ఆత్మహత్యా భావాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఆత్మహత్య చేసుకోవడానికి అవసరమైన వస్తువులను సేకరిస్తుంటారు. కొంతమంది డైరీలలో రాసుకుంటుంటారు. కొందరు స్నేహితులకు సంక్షిప్త సందేశాలు పంపుతుంటారు, క్రమంగా బరువు తగ్గుతుంటారు. అప్పుడప్పుడు అకారణంగా ఏడుస్తుంటారు. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి ఆదరించగలిగితే వారిలో తప్పకుండా మార్పు వస్తుంది. అవహేళన, పోలిక కుంగదీస్తే ఆదరణ ఔషధంలా పని చేస్తుంది. దిగులు, కుంగుబాటు, నిరాశ, నిస్పృహతో ఉన్నవారితో ఆప్యాయంగా మాట్లాడాలి. వారి సమస్యలను అర్థం చేసుకుని మద్దతు ఇవ్వాలి. వాటిని అధిగమించే పద్ధతులు, ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలి. "నీ వెంట నేనున్నాను" అన్న భరోసా కల్పించాలి. దీనివల్ల వారిలో స్వాంతన కలిగి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. క్రమంగా తట్టుకుని నిలబడే మానసిక శక్తి వస్తుంది. ఇన్ని సందర్భాలలో వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్స చేయించవలసి వుంటుంది. ముందు జాగ్రత్తలు పాటిస్తే ఆత్మహత్యలను నివారించవచ్చు.

**వికాసమే విరుగుడు:** ఆత్మహత్యలకు వికాసమే విరుగుడు అంటే అతిశయోక్తి కాదు. మానసిక వికాసం వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను తీర్చిదిద్దుతుంది. సానుకూల దృక్పథం, ఆశావాదం, ఆత్మవిశ్వాసం ఉన్నవారు ఎప్పటికీ ఆత్మహత్యకు పాల్పడరు. వీరు శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. సమస్యలను సవాళ్లుగా స్వీకరిస్తారు. అయితే లేత వయస్సు, సున్నితమైన మనసు గాయపడితే తట్టుకోవడం కష్టం. కాబట్టి తల్లిదండ్రులు, విద్యాసంస్థలు విద్యార్థుల పరిపూర్ణ ఆరోగ్యం సమగ్ర వికాసం పట్ల శ్రద్ధ చూపాలి. వికాస కార్యక్రమాలు, ఆటలు, విహారాలు, స్నేహ సంబంధాలు పెంపొందించాలి. ఇతరులతో పోల్చడం, హేళన చేయడం మానేయాలి. చదువులో వెనకబడితే కారణాలు తెలుసుకుని అధిగమించే మార్గాలు చూపాలి. శక్తికి మించిన లక్ష్యాలు వారిపై రుద్దడం మానుకోవాలి. విద్యార్థి శక్తి, సామర్థ్యం, మానసిక స్థితి, తెలివితేటలు, నైపుణ్యాలను అంచనా వేసి సరైన సలహాలు ఇవ్వాలి. వారి శారీరక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. అందరూ అన్ని విషయాలలో సమానం కాదన్న వాస్తవాన్ని గుర్తించి సలహాలు ఇవ్వాలి. పెద్దల ఆశలు, ఆకాంక్షలు, కోరికలను పిల్లలపై రుద్దడం మానేయాలి.

**- డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి**


# రాజనీతిజ్ఞ దార్శనిక మేధావి.. జైపాల్ రెడ్డి



'దార్శనికుడు, ప్రజాసేవకుడు ఎస్.జైపాల్‌రెడ్డి పోరాటం-వ్యక్తిత్వం' తెలంగాణ భాష, సాంస్కృతిక మండలి అధ్యక్షుడు, రచయిత ప్రొ॥ గంటా జలంధర్ రెడ్డి, బహుముఖ ప్రజ్ఞావంతుడైన తాత్త్విక రాజకీయవేత్త జైపాల్ జీవిత కథనాన్ని సంక్షిప్త సమగ్రంగా వెలువరించారు. గ్రామీణ రైతాంగ కుటుంబం, భౌతిక అవరోధాన్ని సవాలుగా తీసుకొని నిరంతర పోరాట జీవనయానంలో విజేతగా ఒడుదుడుకులను అధిగమిస్తూ తెలంగాణ రాజకీయ మేధావిగా తమ పార్టీని, కేంద్ర నాయకత్వాన్ని తెలంగాణ రాష్ట్ర సాకారం దిశగా నడిపించిన జైపాల్‌రెడ్డి అసాధారణ మేధస్సును, రచయిత జలంధర రెడ్డి అద్భుతంగా చిత్రీకరించారు. అధికార పార్టీలో ఉన్నా, ప్రతిపక్ష నేతగా ఉన్నా పీడిత ప్రజానీకం కలల సాఫల్యానికి దార్శనికవేత్తగా చరిత్రాత్మకమైన తెలంగాణ బిల్లు ఆమోదింపచేసినా ఏ సందర్భంలోనూ ఎక్కడా చెప్పుకోని నిగర్వి, ఆదర్శప్రాయుడైన వ్యక్తిత్వ ఉన్నత సంస్కారిని దర్శింపచేసారు. వ్యవసాయ, పారిశ్రామిక సమాజాల మధ్య ఒక మహా అంతరంలో నేటి సంక్షోభ మూలాలు ప్రధాన అంశంగా 'పది భావజాలాలు' రచన జైపాల్‌రెడ్డి మేధా వైశిష్ట్యాన్ని తెలియచేస్తోంది. శ్రద్ధాంజలి పుటలలో- ప్రముఖ పత్రికా రచయితల అభిప్రాయాలు, వార్తాంశాల విశేషాలు, పత్రికలలోని వ్యాఖ్యానాలు, ఫొటోలు జైపాల్‌రెడ్డి విశిష్ట ప్రతిభా విశేషాల వ్యక్తిత్వానికి ఈ పుస్తకం అద్దం పడుతోంది. తెలంగాణ సీమలో ఒక మారుమూల గ్రామీణ రైతాంగ కుటుంబానికి చెందిన జైపాల్‌రెడ్డి అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా విశిష్ట ప్రజాస్వామ్య నిస్వార్థ ప్రజా సేవకునిగా, సంక్లిష్ట రాజకీయ పరిస్థితులకు ఎదురు ఈదుతూ అయిదు దశాబ్దాల అలుపెరగని పోరాట యోధునిగా, రాజనీతిజ్ఞునిగా, తెలంగాణ సామాన్య జనావళి సుదీర్ఘ స్వప్న సాఫల్యతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందించి చిరఃస్మరణీత సాధించారు.

**(దార్శనికుడు-ప్రజాసేవకుడు.. కీ.శే.ఎస్.జైపాల్‌రెడ్డి గారి పోరాటం-వ్యక్తిత్వం-రచన: ఆచార్య గంటా జలంధర్ రెడ్డి; ప్రతులకు: ప్రొ॥ గంటా జలంధర్ రెడ్డి, తెలంగాణా భాషా సాంస్కృతిక మండలి, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**



## అందాయి

**లవ్ టెన్స్**
- కాలంతో పాటు ప్రేమ
రచన: విజయలక్ష్మి వెంకట్
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచీగూడ ఎక్స్ రోడ్స్, హైదరాబాద్.

**అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి**
రచన: అడిగోపుల వెంకటరత్నమ్
ప్రతులకు: అడిగోపుల పద్మజ కావేరి రెసిడెన్సీ, ఎన్‌జీవో కాలనీ, తిరుపతి-517 507.

**ధర్మమే దైవం(వ్యాస సంపుటి)**
రచన: డా॥ కొల్లు రంగారావు
ప్రతులకు: శ్రీమతి కె.రమ, ఫ్లాట్ 204ఎ, మైత్రి ద టౌన్, శైలి గార్డెనియా, యాప్రాల్, సైనిక్‌పురి, సికిందరాబాద్-500 087.

**రెండు చందమామలు(కథలు)**
రచన: పద్మావతి రాంభక్త
ప్రతులకు: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

## పుస్తక సమీక్ష

# వినోదాన్ని పంచే వింత నవలికలు

**తొడిమెల్ల** కృష్ణమూర్తి రిటైర్డ్ మునిసపల్ ఉద్యోగి. మధ్య తరగతి జీవితాన్ని ఇష్టపడతారు. వీరి రచనలు అవే జీవితాలకు ప్రతిఫలనాలు. కథలు, నవలలు ముందు మాటలు వ్యాసాలతో సాహితీ లోకానికి పరిచయం. పలు పురస్కారాలు అందుకున్న కృష్ణమూర్తి 'ప్రస్తు సమాజాన్ని చూసి బాధపడటం నా హాబీల్లో ఒకటి' అంటారు. ప్రస్తుత సంపుటి 'వింత వివాహం'లో మూడు హాస్య నవలికలున్నాయి. 1987 నుండి 2007 వరకు పలు ప్రసిద్ధ పత్రికలలో ప్రచురించబడి ప్రజాదరణ పొందాయి. కట్నం తీసుకోనని భీష్మ ప్రతిజ్ఞ చేసిన జయసూర్య తండ్రి అచ్చంగా అందుకు వ్యతిరేకం. తనకున్న అర కోటికి కట్నం అర కోటి కలిపి, కోటి అవాలని ఆయన కల. ఒక సభలో సంధ్యాకుమారి అనే కట్న వ్యతిరేకి ముద్దుగుమ్మను చూసి పరస్పరం ప్రేమలో పడతారు. ఇంటర్నెట్ శాస్త్రి పెళ్లిళ్ల పేరయ్య అందరికీ ఆమోదయోగ్యంగా ఇద్దరికీ పెళ్లి జరిపించిన తీరు పాఠకుడిని హాస్య తరంగాల్లో తేలియాడింపచేస్తుంది. నాటక ఫక్కీలో రాయలేదు కానీ గొప్ప నాటకీయత ఉంది నవలలో. మరో నవలిక డి.డి.ల వల. ఆఫీసులో అప్పులు, అధిక వడ్డీకి ఇస్తూ ఉద్యోగుల్ని పీడించుకుతినే రాజారావుకు సవరాల సుందరయ్య అనే బక్కపీచు వ్యక్తి ఎలా బుద్ధి చెబుతాడో నవల చదవాల్సిందే!

వ్యక్తులు, రాష్ట్రాలు, దేశాలు.. అన్నీ అప్పులు చేస్తూ బతుకుతున్నాయన్న సత్యం, ఆ అప్పు ఎదుటి వాడిని పీల్చి పిప్పి చేయకూడదన్న మానవత్వం ప్రదర్శించే ఓ మధ్య తరగతి ఉద్యోగి కథ 'వడ్డీ'. సంభాషణల్లోని హాస్యం మూడు నవలికలని విడవకుండా చదివిస్తాయి. అంతర్లీన సందేశాలు మనసులను కదిలిస్తాయి.

**(వింత వివాహం(3 హాస్య నవలికలు);**
**రచన: టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి; వెల:రూ.200/-లు;**
**ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

**- కూర చిదంబరం**

కథ

# సంధ్యారాగం

శర్మ సిహెచ్

**ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన రాగమయి రోడ్డు ప్రమాదానికి గురైందన్న మెసేజ్‌తో హుటాహుటిన న్యూయార్క్ బయల్దేరాడు మురారి. విమానంలో కూర్చున్నాడే కానీ అతడి మనసు మనసులో లేదు. ప్రమాద సమాచారం పూర్తిగా తెలియకపోవడంతో రకరకాల ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది.**

మురారి, రాగమయి పుట్టినప్పటి నుంచీ వారి కుటుంబాలు విజయవాడలో పక్క పక్క ఫ్లాట్లలోనే ఉండేవి. ఇద్దరూ ఒకరంటే మరొకరు ఇష్టంగా మెలిగేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే వారు మంచి ప్రేమికులు. ఇద్దరిదీ టెన్త్ క్లాస్ పూర్తయ్యాక రాగమయి తండ్రి ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లిపోయారు. అయితేనేం.. రోజూ వీడియో కాల్‌లో గంటల తరబడి ముచ్చట్లాడుకునేవారు.

కాలగమనంలో ఆరేళ్లు గడిచాయి.

మురారి బీటెక్ అయ్యాక రాగమయి తండ్రి రఘుపతి ఆహ్వానం మీద ఎం.ఎస్. చేయడానికి అమెరికా వెళ్లాడు. న్యూయార్క్ సిటీలోని వాళ్లింట్లోనే ఉంటూ చదువుతో పాటు ఉద్యోగమూ చేసేవాడు. తర్వాత బెంగళూరులో మంచి ఉద్యోగం రావడంతో ఇండియా తిరిగొచ్చేశాడు.

ఉద్యోగంలో స్థిరత్వం వచ్చిందని తెలిశాక మురారి, రాగమయిలకు పెళ్లి చేయాలని ఇద్దరి తల్లిదండ్రులూ నిర్ణయించారు.

వారం రోజుల క్రితమే రఘుపతి, శకుంతల దంపతులు కుమార్తె రాగమయితో ఇండియా వచ్చి నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

ఇంతలోనే ఈ దుర్వార్త. ఇదంతా కళ్ల ముందు రీల్‌లా కదలాడుతుండగా.. "సర్" అన్న ఎయిర్ హోస్టెస్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు మురారి.

విమానం దిగి హడావుడిగా క్యాబ్‌లో రఘుపతి కుటుంబం నివసించే విల్లాకు చేరుకున్నాడు. చుట్టుపక్కల నివసించే సుమారు ఇరవై మంది భారతీయులు అక్కడ కుర్చీల్లో కూర్చొని మొబైల్స్ చూసుకుంటున్నారు. ఒక మూలగా రెండు శవపేటికలు కనిపిస్తున్నాయి.

మురారిలో టెన్షన్ మొదలైంది. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ వెళ్లి చూశాడు. అవి రఘుపతి, శకుంతల భౌతికకాయాలు. మరి రాగమయి ఏమైనట్లు? మురారి అనుమానంగా చూస్తుండగా.. ఓ యువకుడు వచ్చి చెప్పాడు..

"రఘుపతి అంకుల్ ఫ్యామిలీ వీకెండ్ గడిపేందుకు వాషింగ్టన్ డీసీకి వెళుతుండగా కారు అదుపుతప్పి హడ్సన్ నదిలో పడిపోయింది. అంకుల్, ఆంటీల డెడ్ బాడీస్ దొరికాయి కానీ రాగమయి ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు ఇంకా వెతుకుతూనే ఉన్నారు.."

ఆ మాటలు విన్న మురారి గుండెలు బాదుకుంటూ రోదించాడు. ఇద్దరికీ దహనక్రియలు నిర్వర్తించాడు.

ఆర్నెల్లపాటు ఉద్యోగానికి సెలవు పెట్టి అక్కడే ఉండి రాగమయి ఆచూకీ తెలుస్తుందేమోనన్న ఆశతో రేయింబవళ్లు వెతికాడు. ప్రయోజనం శూన్యం.

ఇక చేసేది లేక చివరికి తల్లిదండ్రుల ఒత్తిడితో ఇండియాకు వచ్చేశాడు.

..................

రాగమయి కనిపించకుండా పోయి రెండేళ్లయింది. మురారి ఇంకా ఆమెనే తలుచుకుంటూ ఆ జ్ఞాపకాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాడు. పెళ్లి చేస్తే కాస్త తేరుకుంటాడని తల్లిదండ్రులు రవళి, రామారావులు భావించారు.

ఇదే విషయాన్ని పదే పదే చెవినిల్లు కట్టుకుని చెప్పగా చెప్పగా ఎట్టకేలకు అంగీకరించాడు.

రామారావు ధర్మాన్ని, న్యాయాన్ని రెండు కళ్లుగా భావిస్తారు. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు పెద్ద పీట వేస్తారు. ఆయన అభిరుచులు, అలవాట్లనే మురారి వంటపట్టించుకున్నాడు.

కొడుకు ఇష్టానికి తగ్గట్టే సాంప్రదాయ కుటుంబానికి చెందిన కుందనపు బొమ్మలాంటి సంధ్యను ఎంపిక చేశారు. చూడ్డానికి అమాయకంగా కనిపించినా డిగ్రీ వరకు చదివింది. ఆమెను చూసీ చూడంగానే మరో మాట ఎదురు చెప్పకుండా పెళ్లికి ఒప్పుకున్నాడు.

ఈసారి సెంటిమెంట్‌తో తాంబూలాలేవీ లేకుండా నేరుగా పెళ్లి జరిపించేశారు.

మురారి, సంధ్యల జంట ఒకరికోసం మరొకరు పుట్టారా అన్నట్లుంది. ఇద్దరూ బాగా కలిసిపోయారు. కాకినాడలోని అత్తగారింట్లో మూడు నిద్రల ముచ్చట పూర్తి చేసుకుని విజయవాడ చేరుకున్నారు. మురారి రాగమయి స్మృతుల్లోంచి నెమ్మదిగా బయటికొచ్చాడు.

ఆ రోజు పదహారు రోజుల పండుగ. ఇల్లంతా బంధువులతో హడావుడిగా ఉంది.



ఇంతలో ఓ కారొచ్చి ఇంటిముందు ఆగింది. కడుతున్న పూలమాలను పక్కన బెట్టి రవళి పరుగు పరుగున బయటకొచ్చింది. ఆ వచ్చిన వ్యక్తిని చూసి ఒక్క క్షణం నిశ్చేష్టురాలైంది. “ఎవరమ్మా?” అంటూ ఆ వెనుకే మురారి, “ఎవరు రవళీ!” అంటూ రామారావు గారు ఒకరి వెనుక మరొకరు వచ్చారు. వారూ నోరెళ్లబెట్టి బొమ్మల్లా నిలుచుండిపోయారు. “ఏమైంది ఆంటీ? ఎలా ఉన్నావ్ మురారి!?” రాగమయి వారిని పట్టుకుని ఊపుతూ అడిగింది. “ఇన్నాళ్లూ ఎక్కడున్నావు రాగా!” కన్నీటి కొలనులయ్యాయి అతడి నయనాలు.

ఆమె మురారిని గట్టిగా కౌగిలించుకుని బిగ్గరగా ఏడ్చేసింది. రెండు నిమిషాల పాటు కొనసాగిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రాగమయి గతంలోకి వెళ్లింది..

“ఆ రోజు మా కారు నదిలో పడిపోయింది. నేను సీటు బెల్టు పెట్టుకోకపోవడంతో జారిపడ్డాను. తలకు బలమైన గాయం తగలడంతో స్పృహ కోల్పోయాను. నన్నెవరో రక్షించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఓ అనాథ శరణాలయం నిర్వాహకులు నాకు చికిత్స చేయించారు. వారం రోజుల క్రితమే కోమాలోంచి బయటికొచ్చాను. అమ్మా నాన్నల గురించి తెలుసుకుందామని ప్రయత్నించగా వారు ప్రమాదంలో చనిపోయినట్లు తెలిసింది. ఇక చేసేది లేక మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను.

ఇదంతా విన్నాక వారందరి నెత్తిన ఒక్కసారిగా వంద పిడుగులు పడినట్లయింది. ఈ విషయాన్ని దాచి పెళ్లి చేసిన రామారావు కుటుంబం డైలమాలో పడింది. అందుకే రాగమయి గురించి సంధ్యకు చెప్పకూడదని ముగ్గురూ కూడబలుక్కున్నారు. తనకు సంధ్యతో పెళ్లయిన విషయాన్ని రాగకు చెప్పి పాత జ్ఞాపకాలను బయట పెట్టొద్దని వేడుకున్నాడు మురారి.

రాగమయి లిప్తకాలం పాటు ఆలోచించి రాలుతున్న కన్నీటి చుక్కల్ని కర్చీఫ్‌తో అద్దుకుంటూ “సరేనని..” తలూపింది ఇష్టం లేనట్లుగానే.

రాగమయిని తన చిన్ననాటి స్నేహితురాలిగానే సంధ్యకు పరిచయం చేశాడు మురారి. పైకి కనిపించని వేదన రోదనల నడుమ పదహారు రోజుల పండుగ పూర్తయింది.

తన జీవన గమ్యమేమిటో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్న రాగమయిని తమ ఇంట్లోనే ఉండాలని రామారావు దంపతులు వేడుకున్నారు.

తొలుత ససేమిరా అన్న రాగమయి మురారిపై ఉన్న ప్రేమతో ఉండడానికి అంగీకరించింది.

.........................

నెల రోజుల తర్వాత.. తన కళ్లముందే చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్న కొత్త జంటను చూసి రాగమయికి కన్ను కుట్టింది. మురారితో గడిపిన పాత రోజుల్ని గుర్తుకు తెచ్చుకుంది. ఎలాగోలా సంధ్యకు విడాకులు ఇప్పించి మురారిని తనవాడిని చేసుకోవాలన్న ఆశ మెదడులో తొలచసాగింది. ఆలోచన వచ్చిందే తడవుగా మురారిని ఈటెల్లాంటి మాటలతో వేధించసాగింది. ఎంగేజ్‌మెంట్ అయితే సగం పెళ్లయినట్లే. అలాంటప్పుడు సంధ్య మెడలో తాళెలా కట్టావ్? లాజిక్కులు వల్లించింది. అయినా మనం చిన్నప్పటినుంచీ కలిసి తిరిగాం. ప్రేమించుకున్నాం. అలాంటిది మధ్యలో వచ్చిన అమ్మాయితో జీవితాన్ని ఎలా పంచుకుంటావ్? ఎప్పుడూ ధర్మం, న్యాయం అంటూ ఉపన్యాసాలిస్తావు కదా.. మరి నాకు ఏ విధంగా న్యాయం చేస్తావ్?” కసిగా, కోపంగా ప్రశ్నించింది.

రాగమయిని తన చిన్ననాటి స్నేహితురాలిగానే సంధ్యకు పరిచయం చేశాడు మురారి. పైకి కనిపించని వేదన.. రోదనల నడుమ పదహారు రోజుల పండుగ పూర్తయింది.

రెండేళ్ల క్రితం పరిస్థితుల్ని, ప్రస్తుత పరిస్థితిని వివరంగా విడమర్చి చెప్పి “తనను నమ్ముకొని వచ్చిన సంధ్యకు అన్యాయం చేయలేనని” గద్గద స్వరంతో చెప్పాడు మురారి.

“సరే.. మీ అందరి అంతు చూస్తా.. కోర్టుకు లాగుతా” పరుషంగా మాట్లాడుతూ హెచ్చరికలు జారీ చేసింది రాగమయి.

తనెప్పుడో చూసిన తెలుగు సినిమాలన్నీ రీల్లా మురారి చుట్టూ గిరగిరా తిరుగుతున్నాయి. ఈ విషయాలేవీ సంధ్యకు తెలియకుండా జాగ్రత్త పడుతూనే రోజులు నెట్టుకొస్తున్నాడు.

సరిగ్గా అదే సమయంలో హోం సిక్‌కు గురైన భార్యను పుట్టింట్లో దించేందుకు కారులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రకరకాల ఆలోచనలు చుట్టుముట్టగా కారు నడుపుతూ ప్రమాదానికి గురయ్యాడు. స్వయంగా తన డాక్టర్ ఫ్రెండ్‌కి ఫోన్ చేసి విషయం చెప్పి అంబులెన్స్‌ను రప్పించుకున్నాడు. ఆస్పత్రికి చేరేసరికి భారీగా రక్తం పోయింది.

డాక్టర్ శ్రీకాంత్ అన్ని పరీక్షలు చేసి పిడుగులాంటి వార్తొకటి చెప్పాడు. అది విన్న రామారావు దంపతులు, రాగమయి ఉలిక్కిపడ్డారు. వారి ఆక్రందనలను ఆస్పత్రి సిబ్బంది అడ్డుకుని బయటకు పంపడంతో మళ్లీ నిశ్శబ్దం ఆవరించింది. ఈ వార్తను సంధ్యకు చెప్పొద్దని మురారి వేడుకోగా రామారావు సరేనన్నారు. మూడు రోజుల తర్వాత మురారి కోలుకోగా డిశ్చార్జి చేశారు. ఇంటికెళ్లేసరికి రాగమయి జాడ కనిపించకపోవడంతో అనుమానంగా తల్లి వంక చూశాడు.

“మొన్న డాక్టర్‌గారు నీ గురించి చెప్పినప్పటి నుంచీ రాగమయి ఏడుస్తూ కూర్చుంది. ఇవాళ ఉదయం మేం లేచేసరికి పెట్టేబేడా సర్దుకుని అమెరికా విమానం ఎక్కేసింది” అంటూ ఆమె రాసిన ఉత్తరం తెచ్చిచ్చింది.

థాంక్ గాడ్. ఒక ఐడియా జీవితాన్నే మార్చేసింది. వంద అబద్ధాలు ఆడి ఒక పెళ్లి చేయమన్నారు పెద్దలు. నేను ఒక్క అబద్ధం మాత్రమే ఆడి ఒక పెళ్లిని నిలబెట్టాను..

సంతోషంగా తన భుజాన్ని తానే తట్టుకుంటుంటే రామారావు ఆశ్చర్యంగా అడిగాడు “అవున్రా అబ్బాయ్.. నీకు హెచ్‌ఐవీ పాజిటివ్ ఎలా వచ్చింది? అమెరికాలో ఉన్నప్పుడు ఏమన్నా..”

ఆయన మాటకు డాక్టర్ శ్రీకాంత్ అడ్డుతగిలాడు “ఆ రిపోర్టు నిజంగా అబద్ధమే. అంకుల్! ఇదంతా నేనూ, మురారి కలిసి ఆడిన నాటకం”.

ఆ మాటల్ని విని అంతా సంతోషించారు.

# శిలాక్షరాల నుంచి కీ బోర్డ్ వైపు..

**'మాతృ' అనే పదం ప్రాముఖ్యతను అనుసరించి మాతృదేశాభిమానం, మాతృ భాషాభిమానం పుట్టాయి. తల్లితో సమానంగా వాటిని గౌరవించాలని, ప్రేమించాలని పెద్దలు సూచించారు.**

దేశం అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలోని జనులందరూ వారి 'స్వదేశ', 'స్వభాష'లను ఆదరించి విధేయులుగా వ్యవహరించాలి. దేశమంటే తెలియని పరిస్థితులలో, స్వభాష తెలియని పరిస్థితులు భారతీయులు నాడు ఎదుర్కొన్న దుర్భర కాలంలో, విదేశీయత రాజ్యం చేసింది. నిజమే! తెలివిహీనత, స్వమాతృ దేశ, భాషాభిమానం లేకపోవడం వలన పరాయి భాషలు రాజభాష, బోధనా భాషలుగా నెత్తిన రుద్దబడుతున్నాయి. కానీ శతాబ్దాల తరబడి, స్వాతంత్ర్య పోరాటాల ఫలితంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించుకొన్నాం. దాస్య శృంఖలాలు తొలగిపోయినా ప్రస్తుతం భాషా స్వేచ్ఛకు యింకా దూరం అవటంతో ఇప్పుడు మాతృభాషలు కనుమరుగయ్యే ప్రమాదం మరింత పెరిగింది.

ప్రస్తుతం కేవలం ఆంగ్ల ప్రభావం నిత్యం అధికమైపోతోంది. అది సాంకేతిక విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పెట్టుబడి, మార్కెట్ ఎన్నో అంశాలతో ముడిపడి ఉంది. ఆ సంకెళ్ల వదిలించుకోవాలంటే ఇక భాషా, సాంస్కృతిక పోరాటాలు చేయక తప్పదు. భారతీయ భాషల ఆత్మగౌరవమే, దేశ సాధికారతకు చిహ్నం. దేశాన్ని ప్రేమించడం అంటే భారతదేశంలోని అనేక ప్రజల భాషలను ప్రేమించడమే" అంటారు ఆచార్య జయధీర్ తిరుమలరావు. సుమారు 80 యేళ్ల కింద, తెనుగును ఉర్దూ, ఆంగ్లం వంటి అన్య భాషా సాంకర్యం నుండి విముక్తి చేసి, శిష్ట వ్యవహారిక భాషగా సర్వాదరణంగా గౌరవించాలనే తలంపు తల ఎత్తిన ఒక లిఖిత పత్రిక, మాతృభాషకు సంబంధించిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకొనే సందర్భంలోని సమగ్ర చర్చలో ప్రస్తావన అది.




ఈ భూమండలంపై ప్రపంచంలో 6,500 పైగా భాషలున్నాయి. మన దేశంలో ఆంగ్లంతో కలిపి 23 భాషలు మాట్లాడే ప్రజలున్నారు. పుట్టిన పసిబిడ్డల ఏడ్పు కూడా అమ్మభాషలోనే ఉంటుందని జర్మనీ శాస్త్రజ్ఞుల పరిశోధనలు తేల్చి చెప్పాయి. అమ్మచేతి గోరుముద్దల భావ వ్యక్తీకరణ పదాల పలుకుబడి, కథలు, పాటలు, మాటలు పిల్లల లేత వయసులో ఉండే ప్రత్యేక మేధా లక్షణం వల్లనే అంకురిస్తుంది. తల్లిపలుకు ద్వారా పసిపిల్లలు తమ జాతి, సంస్కృతి అభిమానించే అవగాహన ఏర్పడుతుంది.

మానవ జీవన పరిణామ క్రమంలాగే, ప్రపంచంలో ఏ మాతృభాష అయినా పరిణామ క్రమం పొందుతూనే ఉంటుంది. ఇప్పుడు మనం రాస్తున్న తెలుగు లిపి వెయ్యేళ్ల క్రితంనాటి కాలంలో లేదు. తెలుగు భాషా వికాస పరిణామాలను గురించి పరిశీలిస్తే, తాటాకు రాతప్రతులు చూసి, పాఠాన్ని పరిష్కరించిన తర్వాత ముద్రిత గ్రంథాలు వెలుగు చూసాయి. తెలుగు శాసన భాషగా శిలా, తామ్ర పలకల మీద ఎలా ఆవిర్భవించిందో అదేవిధంగా ఉండేటట్టు చారిత్రక పుటలలో పదిలమైంది.

కానీ తాటాకు ప్రతులకు సంబంధించిన ప్రాచీన ప్రతుల మాతృక ఆధారంగా, ప్రతిని చూచి ప్రతి రాసి కాలగర్భంలో కలిసి నశించిపోకుండా ప్రాచీన పండిత కవులు కొంత నిలువరించారు. క్రీ.శ.1416వ సంవత్సరం జనవరి 14వ తేదీతో శ్రీనాథ మహాకవి స్వయంగా రచించి రాసి సంతకం చేసి రాతి మీద చెక్కించిన శాసన భాష, శిలాక్షరాలుగా సజీవంగా ఉంది.

తెనుగుభాష రాను రాను మారి, గిడుగు వారి కాలం నాటి వ్యవహారిక భాషగా పరిణామం పొంది, క్రమేణా ప్రస్తుత స్థితిగతులలో ఏమాత్రం పోల్చుకోవటానికి అసాధ్యమైన పరిణామ వ్యవహారికాన్ని పొందింది. దేశాభిమానం నుంచి భాషాభిమానం విజృంభించే కారణం చేత తెలుగు వారికి భాషాభిమానం కేవలం మిథ్య అనే అపకీర్తి సంభవించగలదని, వ్యవహారిక భాషోద్యమ నేత గిడుగు రామమూర్తి ఆనాడే హెచ్చరించారు.



శాసనాలు, తాటాకు గ్రంథాలు వివేకంతో విమర్శనం చేసి, భాషా తత్త్వ జిజ్ఞాసువులు అవలంబించిన ఆధునిక అన్వేషణా క్రమానుసారం, తెలుగు భాషా స్వరూపాన్ని నిర్దేశిస్తోంది. నన్నయ స్వయంగా రాసిన రాత ఎదురుగా ఉంచుకొని, నన్నయభట్టు సమక్షంలో, రాగిరేకుల మీద గండాచార్యుడు యథాస్థితిగా శాసనం చెక్కినట్టు శిలాశాసనం ఉంది కాబట్టి, ఆ శిలాక్షరాలలో భాష నన్నయ కాలంనాటి తెలుగు అని చెప్పటానికి ఇంతకన్నా విశ్వసనీయ ప్రమాణం లేదని గిడుగువారు స్పష్టం చేసారు.

"ఇతర భాషలో విద్య నేర్చుకునే వారు, నేర్పేవారు తెలుగుని మరిచిపోతారు. ఇదొక విష వలయం. ఉద్యోగాల కోసం తల్లిభాషని విస్మరించడం బాధాకరం". అమ్మ ఊసుకు మనసుకి దగ్గర సంబంధం ఉంది. మాతృభాషా మాధ్యమం ద్వారానే పరాయి భాషలను సులభంగా నేర్చుకోగలుగుతాం. విజ్ఞాన శాస్త్రాలను తేలికగా అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రపంచంలోని పలు భాషలు ఆంగ్ల భాషాధిపత్యంలో కుంగి కృశించి తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. జపాన్‌లో అత్యున్నత స్థాయి విద్యా విధానం మాతృభాషా మాధ్యమంలోనే బోధింపబడుతుంటే మనం తెలుగు ఎందుకు అంటూ నిరసిస్తున్నాం.

యునెస్కో ఒక భాషను మాట్లాడే జనాభాలో 30 శాతం ఆ భాషను చదవకుండా, రాత లేకుండా, అమ్మనుడికి దూరం అయితే ఆ భాష కాలక్రమంలో మృతభాషగా మారుతుందని సూత్రీకరించింది. అందుకే 2000 సంవత్సరం నుండి ప్రతీ యేటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృ భాషా పరిరక్షణ దినంగా ప్రకటించింది. జర్మనీ, జపాన్, రష్యా, చైనా, దేశాలలో ప్రపంచ భాషలలో ఉపయుక్తమైన సమాచారాన్ని వారి మాతృ భాషలలోకి తర్జుమా చేస్తారు. జర్మనీ విద్యార్థి జర్మనీ భాషలో ఇంజినీరింగ్ చదువుతుంటే తెలుగు విద్యార్థి పరాయి దేశాలకు పరుగులు తీస్తున్నాడు. భాష, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవటం ద్వారా జీవ వైవిధ్యాన్ని రక్షించుకోగలమని యునెస్కో ప్రకటించింది. అంతర్జాతీయ సంస్థలు, యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫరాల్, జనరల్ అసెంబ్లీ వంటి ప్రపంచ స్థాయి సంస్థలెన్నో ప్రాథమిక విద్యని తల్లిభాషలో నేర్చుకొనే ఆవశ్యకత, హక్కు చాటి చెప్పాయి. తెలుగులో చదువు లేకపోవటంతో తరగతి గదులు ఇరుకై బెరుకు, భయం ప్రవేశించింది. బడి మానేసే పిల్లల సంఖ్య పెరుగుతోంది. పిల్లలకు ఆసక్తి పెరిగేటట్టు ప్రాథమిక, మాధ్యమిక విద్య మాతృ భాషలో కొనసాగించాలి.



అంతరించిపోయే భాషల జాబితాలోకి చేరువ అవుతున్న మన మాతృభాష తెలుగు గురించి మాట్లాడుకోవాలి. నలుగురు తెలుగువారు కలిసినప్పుడు తెలుగులో మాట్లాడుకోవాలి. విద్యార్థుల సామర్థ్యాన్ని ఆంగ్లంలో ప్రతిభ ఆధారంగా నిర్ణయించకూడదు.

వ్యావహారిక భాషోద్యమ నాయకుడు తెలుగు భాష, సాంస్కృతిక వైతాళిక మహోదయులు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రతీ సంవత్సరం ఆగస్టు 29న జరుపుకుంటున్నాం. రెండు తెలుగు రాష్ట్రాలుగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు మాతృభాష పరిరక్షణకు కనీసం ఇప్పటికైనా ఉత్తేజవంతంగా సమాయత్తం కావాలి. పాలనతో పాటు తెలుగు భాషలో సాంకేతిక పదాలు, అనువాదాలు సృష్టించబడాలి. పర భాషలో నుండి వచ్చిన వాడుకలో ఉండే పదాలను ప్రామాణికంగా తీసుకోవాలి. భవన నిర్మాణానికి పునాది బలంగా వున్నట్టే, మాతృభాషలో ప్రాథమిక మాధ్యమం పిల్లల మానసిక ఎదుగుదలతో పాటు, భవిష్య జీవనం పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగే సురక్షిత భవితవ్యానికి దారి చూపిస్తుంది.

**- జయసూర్య**

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# కృష్ణుడి మాట

**పూర్వం** ఒక బ్రాహ్మణుడి భార్య ఒక శిశువును ప్రసవించింది. ఆ శిశువు వెంటనే మరణించాడు. అప్పుడా బ్రాహ్మణుడు ఆ శిశువును తీసుకొని ద్వారకలోని కృష్ణుడి నివాసానికి వచ్చాడు. పూర్వ కాలంలో అంటే ద్వాపర యుగాంతం వరకు ఒక రాజ్యంలో తల్లిదండ్రులు జీవించి ఉండగానే వారి కొడుకు మరణిస్తే అందుకు రాజే బాధ్యుడని భావించేవారు. శ్రీరాముడి కాలంలో కూడా అలాంటిదే ఉండేది. పుట్టగానే బిడ్డ మరణించడంలో రాజు దోషం లేకున్నా బ్రాహ్మణుడు రాజ ప్రాసాదంలోకి వెళ్లి రాజును నిందించాడు. ప్రస్తుతం ఈ దేశాన్ని పాలించే రాజు ఉగ్రసేనుడు బ్రాహ్మణ ద్వేషి అని, వేదాలను, బ్రాహ్మణులను ద్వేషించేవారిని బ్రహ్మద్వేషి అంటారని ఈ విధంగా రాజు బ్రహ్మ ద్వేషే కాక బుద్ధిహీనుడని ఆ బ్రాహ్మణుడు రాజును దూషించాడు. ఒక రాజు దురాశాపరుడు, స్వార్థపరుడు అయితే అతనికి ప్రజలను పాలించే హక్కు లేదని అన్నాడు. పైగా ఆ బ్రాహ్మణుడు రాజును క్షత్రబంధువని కూడా దూషించాడు. ఈ రాజుకు రాజ లక్షణాలు లోపించినందున పుట్టగానే తన కుమారుడు మరణించాడని రాజుపై దోషం మోపాడు. ఇలా దూషించి ఆయన వెళ్లిపోయాడు. కొంత కాలానికి అతనికి రెండవ శిశువు జన్మించాడు. అతను కూడా పుట్టగానే మరణించాడు. ఇలా ఆ బ్రాహ్మణుడికి 9 మంది పిల్లలు కలిగారు. వాళ్లందరూ పుట్టగానే మరణించారు. ప్రతిసారీ రాజప్రాసాదం ద్వారం వద్ద నిలిచి రాజుని నిందించి వెళ్లేవాడు. 9వ సారి కూడా అతనలా ద్వారకా నగర రాజును దూషించడానికి వచ్చినప్పుడు అర్జునుడు కృష్ణుడిచెంత ఉన్నాడు. ఆ బ్రాహ్మణుడు రాజును దూషించినపుడు అర్జునుడికి ఆసక్తి కలిగి అలా దూషించడానికి కారణమేమిటని అడిగాడు. విషయం తెలుసుకున్న అర్జునుడు ఆ బ్రాహ్మణుడితో "నీ శిశువులకు నేను రక్షణ కల్పిస్తానని వాగ్దానం చేస్తున్నాను. అలా నేను చేయలేకపోతే అగ్నిప్రవేశం చేస్తానని" శపథం చేశాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు "అర్జునా! బలరాముడు నా గోడు విని నా బిడ్డలను కాపాడలేకపోయాడు. కృష్ణుడు కూడా నాకు రక్షణ కల్పించలేదు.ఆ బ్రాహ్మణుడు భగవంతుడికే అసాధ్యమయిన పనిని నువ్వెలా నిర్వర్తిస్తావని?" పరోక్షంగా అర్జునుడిని ఎత్తిపొడిచాడు. అయితే అర్జునుడు తనపై ఆ బ్రాహ్మణుడికి నమ్మకం కలిగేలా తన సఖుడైన కృష్ణుడిని కూడా విమర్శిస్తూ మాట్లాడాడు. "బ్రాహ్మణోత్తమా! నేను కృష్ణుడిని కాను. ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుల వంటి కృష్ణుడి పుత్రుల్లో ఒకడిని కాను. నా పేరు అర్జునుడు. నేను గాండీవం కలిగినవాడిని. అడవిలో శివుడు, నేను ఒక వేట విషయంలో ఘర్షణ పడి ఆయనతోనే పోరాడి ప్రశంసలందుకున్నాను. నా పోరాట పటిమ చూసి శివుడు ప్రత్యక్షమై నాకు పాశుపతాస్త్రం ఇచ్చాడు. కనుక నా పౌరుషాన్ని శంకించకు. నేను మృత్యుదేవతతో పోరాడాల్సి వచ్చినా వెనుకాడక నీ కుమారులను నీకు అప్పగిస్తానని" అర్జునుడు చెప్పగానే బ్రాహ్మణుడికి కొంత నమ్మకం కలిగి ఇంటికెళ్లాడు.



కొంత కాలానికి బ్రాహ్మణుడి భార్య మరొక బిడ్డను ప్రసవించనుండగా బ్రాహ్మణుడు అర్జునుడిని పిలిచాడు. అర్జునుడు పాశుపతాస్త్రాన్ని పట్టుకొని ఆ బ్రాహ్మణుడి ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి బ్రాహ్మణుడి భార్య ప్రసవించబోయే ముందు అర్జునుడిని పిలిచాడు. అప్పుడు అర్జునుడు తన మిత్రుడైన కృష్ణుడినిగాక శివుడిని స్మరించాడు.

కృష్ణుడు ఆ బ్రాహ్మణుడి పుత్రులను రక్షించలేకపోయాడు కనుక శివుడిని స్మరించడం మేలని భావించాడు. తర్వాత ఆయన తప్పు తెలిసి వచ్చింది. బ్రాహ్మణుడి భార్య మగబిడ్డను ప్రసవించింది. కొద్ది క్షణాల్లోనే అర్జునుడి అస్త్ర శస్త్రాలు, ఆ శిశువు మాయమైపోయాయి. అర్జునుడు తనని ధిక్కరించడం వల్ల కలిగిన పరిణామం చూసి కృష్ణుడు వినోదించాడు. ఆయన తన మాయతో బ్రాహ్మణుడి శిశువును, అస్త్రాలను మాయం చేశాడు. ఇలా తన బిడ్డ మాయం కాగానే బ్రాహ్మణుడు అర్జునుడిని తీవ్రంగా దూషించాడు. తాను అర్జునుడి మాటలను నమ్మానని, అతను నపుంసకుడని, మిథ్యా వాగ్దానాలు చేయడంలో అతను దిట్ట అని అన్నాడు. అర్జునుడు గాండీవాన్ని కృష్ణ బలరాములను కూడా లెక్కచేయకుండా వారికంటే తాను అధికుడని గర్వించాడని అతనికి తగిన గర్వభంగం జరిగిందని బ్రాహ్మణుడు రోదిస్తూ అర్జునుడిని తిట్టాడు. దాంతో అర్జునుడు బ్రాహ్మణుడికి తాను చేసిన వాగ్దానం ప్రకారం అగ్నిప్రవేశానికి సిద్ధపడ్డాడు. కానీ అర్జునుడు అగ్నిప్రవేశం చేయకుండా కృష్ణుడు వారించాడు. అర్జునుడు అగ్నిలో దూకి మరణిస్తే అది తనకు అవమానమని కృష్ణుడు భావించాడు. తానే ఆ శిశువును తీసుకొస్తానని కృష్ణుడు చెప్పాడు. తర్వాత అర్జునుడితో సహా ఆయన దివ్య రథంలో ఉత్తర దిశగా బయలుదేరారు. కృష్ణుడు ఊర్ధ్వ లోకాలను దాటి విశ్వానికి పైకప్పుకు చేరుకున్నాడు. పైకప్పులో సూర్యప్రకాశం ఉండదు కనుక అంతా అంధకారమయంగా గోచరించింది. అయితే కృష్ణుడు తన సుదర్శన చక్రం సాయంతో రథాన్ని ముందుకు నడిపించాడు. కృష్ణుడు అర్జునుడితో "అర్జునా! ఈ ఆధ్యాత్మిక కాంతి నా దేహం నుండి వెలువడే కిరణ సముదాయమే. ఈ జ్యోతిని నేనే" అని పలికాడు.

అర్జునుడు నివ్వెరపోయి కృష్ణుడి వంకే చూస్తుండిపోయాడు. అన్న మాట ప్రకారం కృష్ణుడు శిశువును తీసుకురావడంతో కథ సుఖాంతమైంది.

**- యామిజాల జగదీశ్**



వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ
**డా॥ దంతూరి పండరినాథ్**
సెల్: 9885446501/9885449458



# నైరుతి దిక్కులో పెద్ద గొయ్యి ఉంది..?

**బి.పావని, విజయవాడ**

ప్రశ్న: మా స్థలానికి తూర్పు, ఉత్తరం వైపు రోడ్లు ఉన్నాయి. దక్షిణం, పశ్చిమం వైపు 'పెద్ద గుంత' ఉన్నది. గుంత ఉన్న స్థలం మాది కాదు. వేరే వారిది. మా స్థలం లెవెల్‌కి, గుంత వైపు హద్దుగా రెండు వైపులా గోడ కట్టుకొని అందులో ఇల్లు కట్టుకున్నాం. మాకు దుకాణంలో లాభాలు లేవు. ఎప్పుడూ కష్టమర్లతో గొడవలు. యజమానికి బాగా కోపం పెరిగిపోయి వ్యాపారం మూతపడే స్థితికి వచ్చింది. పిల్లల చదువులు బాగానే ఉన్నాయి. నా సమస్యకి తగిన పరిష్కారం తెలుపగలరు.

జవాబు: తూర్పు, ఉత్తరాలకు వీధి ఉన్న మీ స్థలం ఈశాన్య స్థలం. ఈశాన్య స్థలాలకు వాస్తులో ప్రథమ ప్రాధాన్యతనిస్తారు. నైరుతి బయట గొయ్యి ఉండటం దోషమే అవుతుంది. కానీ కేవలం నైరుతి భాగంలో పశ్చిమ, దక్షిణ దిక్కులలో కొంత మేరకు ప్రహరీ గోడలు కట్టి మిగతా దిక్కులో ప్రహరీ గోడలు నిర్మించకపోవడం పెద్ద వాస్తు దోషమవుతుంది. ఆ గొయ్యి పూడ్చేసే ప్రయత్నం చేయండి. ప్రహరీ గోడలను నాలుగు దిక్కుల్లో కూడా వాస్తు ప్రకారం నిర్మించండి. మీ సమస్యలు తగ్గుతూ మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి.

## తూర్పు ఆగ్నేయ వీధిపోటు

**ఎస్.ఆర్, నంద్యాల**

ప్రశ్న: చూడకుండా తూర్పు ముఖంగల డాబా కొన్నాం. ఇంటి ఆగ్నేయం ఎదురుగా అడ్డరోడ్డు, నిలువుగా ఎదురుగా ఆగ్నేయ మూలకు ఒక రోడ్ ఉంది. ఇంట్లో అశాంతి, ఊహించని ప్రమాదాలు, మనోవేదన, ఆర్థిక ఇబ్బందులు, ఆవేదన, ఆందోళన, ఘర్షణలు, అవమానాలు, అపవాదులతో ఎంతో ఇబ్బంది పడుతున్నాం. ఇల్లు వదలలేని దీన స్థితిలో ఉన్నాం. సంతానంతో సమస్యలు. ఎన్ని పూజలు చేసినా పరిస్థితులు మారడం లేదు. ఏం చేయమంటారు?

జవాబు: మీరు వివరించిన దానిని బట్టి మీరు కొన్న తూర్పు ముఖం గల ఇంటికి తూర్పు ఆగ్నేయ వీధిపోటు ఉన్నట్టు తెలుస్తోంది. 'తూర్పు ఆగ్నేయ వీధిపోటు' అనేక విధాల ప్రతికూల ఫలితాలనే ఇస్తుంది. మీరు పేర్కొన్న సమస్యలకు కూడా ఆ వీధిపోటు వలన కలిగే ప్రతికూల ఫలితాలే కారణం అయ్యే అవకాశం ఉంది. మీరు మీ ఇంటి ప్లాన్ కూడా పంపిస్తే బాగుండేది. తూర్పు ఆగ్నేయంలో వీధిపోటు స్థలానికి స్వల్పంగా తగులుతున్నట్టయితే అంతవరకు స్థలాన్ని వదిలేసి, తిరిగి ప్రహరీ గోడను నిర్మించుకోవడం వలన ఆ వీధిపోటు సమస్య పరిష్కారం అవుతుంది. అలా వీలుగాని పరిస్థితుల్లో ఒకసారి వ్యక్తిగతంగా సంప్రదించండి. మరిన్ని వివరాలు తెలుసుకుంటే ప్రత్యామ్నాయ పద్ధతులు వివరించే వీలు ఉంటుంది.

**ఎన్.అశోక్, హైదరాబాద్**

## కాయలున్న మామిడిచెట్టును తీసివేయవచ్చా?

ప్రశ్న: మామిడిచెట్టు పెద్దగా పెరగటం వలన బిల్డింగ్‌కి భవిష్యత్తులో నష్టం కలుగుతుందని భావిస్తున్నాం. మేం ఆ చెట్టును తీసివెయ్యాలని అనుకుంటున్నాం. కానీ "కాయలు కాసే చెట్టును కొట్టకూడదని" చాలా మంది అంటున్నారు. సలహా ఇవ్వగలరు.

జవాబు: గృహావరణలో ఎత్తుగా పెరిగే ఫలవృక్షాలను తీసివేయవలసి వస్తే కాయలు కాస్తున్నప్పుడు తీసివేయకూడదు. సంవత్సర కాలంలో చెట్టుకు పూత లేని రుతువులో ఆయా చెట్లకు తగిన శాంతి చేసి ఆ చెట్లను తీసివేయవచ్చు. బాగా పెరిగి వున్న వేప, రావి చెట్లను తీసివేయకుండా వదిలేయటమే మంచిది.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:...............................................

# ఆధ్యాత్మికతను పెంచే 'శివాలయ ఒట్టం'



యుగయుగాల నుండి స్వయం పరమాత్మ నడయాడిన భరత భూమిలో అనేకానేక విశ్వాసాలు, ఆచారాలు, నిబంధనలు, యాత్రలు కనపడతాయి. అవి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భిన్నంగా ఉండటం గమనించవలసిన అంశం.

అదే విధంగా వాటితో ముడిపడి ఉన్న గాథలు కూడా మనకి ఏ పురాణంలోనూ కనపడవు. అయినా భక్తులు ఇహపర సుఖాలను కోరుకుంటూ వాటిని భక్తిశ్రద్ధలతో పాటిస్తూ ఉంటారు. అలాంటి వాటిలో ఒకటి "శివాలయ ఒట్టం". అరుణాచల గిరి ప్రదక్షిణ, కైలాస మానస సరోవర పరిక్రమ, గోవర్ధన గిరి ప్రదక్షిణ ఇవన్నీ మనందరికీ తెలిసిన విషయాలు. ప్రస్తుతం మన రాష్ట్రంలో సింహగిరి, ఇంద్రకీలాద్రి. కోటప్పకొండ త్రికూట పర్వత ప్రదక్షిణాలు కూడా నిర్వహించబడుతున్నాయి. వీటన్నింటికీ భిన్నమైనది "శివాలయ ఒట్టం".

## శివాలయ ఒట్టం

పైన పేర్కొన్నవన్నీ ఒక అచల పర్వతాల చుట్టూ భక్తిప్రపత్తులతో ప్రదక్షిణ చేయడం. కానీ 'శివాలయ ఒట్టం'లో ఇరవై నాలుగు గంటలలో పన్నెండు పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన శివాలయాలను సందర్శించడం, ఆ ఆలయాల నుండి విభూతి, అభిషేక జలం సేకరించడం. మలయాళ భాషలో 'ఒట్టం' అంటే పరుగు, ప్రవహించు లేక సాగించు అన్న అర్థాలు ఉన్నాయి. అవన్నీ భక్తులు మహాశివరాత్రినాడు చేసే శివాలయ ఒట్టంకు సరిగ్గా సరిపోతాయి. ఎందుకంటే భక్తులు ఇరవై నాలుగు గంటల లోపల వంద కిలోమీటర్లు పరిగెత్తుతూ పన్నెండు శివాలయాలను సందర్శించుకోవాలి.

తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లా పడమర దిశలో విశేష ఆలయాలు నెలకొని ఉన్నాయి. ద్వాపర యుగంలో శ్రీహరి అవతారమైన శ్రీకృష్ణ లోకానికి నరనారాయణులు వేరువేరు కాదు అన్న విషయాన్ని తెలపడానికి ఒక చమత్కారాన్ని చేశారు.

ఆ సమయంలో ఉద్భవించిన ద్వాదశ లింగ ఆలయాలను సందర్శించే యాత్రను 'శివాలయ ఒట్టం' అంటారు. ప్రతినిత్యం భక్తులు ఈ ఆలయాలను సందర్శిస్తుంటారు. కానీ మహా శివరాత్రినాడు చేసే ఈ యాత్ర ఇహపర సుఖాలను ప్రసాదిస్తుంది అని విశ్వసిస్తారు భక్తులు. ఈ సంప్రదాయం ఆరంభం అవడానికి సంబంధించిన గాథ ద్వాపర యుగం నాటిది.

## శివాలయ ఒట్టం పురాణ గాథ

ఈ ఒట్టం యాత్ర గురించిన గాథ స్థానికంగా వినిపించేది మహాభారతంలో అందులోని ముఖ్య పాత్రలైన పంచ పాండవులు, శ్రీ కృష్ణునితో ముడిపడి ఉండటం విశేషం. కురుక్షేత్రం విజయంతో చక్రవర్తి హోదాను పొందిన ధర్మరాజు రాజ్య సంక్షేమం గురించి ఒక యాగం తలపెట్టారట. ఆ యజ్ఞానికి 'పురుష మృగం' పాలు కావాలని రుత్విక్కులు తెలిపారట.

పరమేశ్వర ప్రీత్యర్థం చేయతలపెట్టిన ఆ యాగం కోసం కావలసిన సరంజామా అంతా శ్రీకృష్ణుని అనుగ్రహంతో ఇట్టే సంపాదిస్తామని గర్వంగా పలికి బయలుదేరారట భీమసేనుడు. వాసుదేవుడు అతని చేతిలో పన్నెండు రుద్రాక్షలను ఉంచి అవసరం అయినప్పుడు ఒక్కొక్కటిగా నేల మీదకు వదలమని చెప్పారట. పురుష మృగం వద్దకు వెళ్ళినప్పుడు "గోపాల.. గోవిందా" అని పెద్దగా స్మరిస్తూ వెళ్లమని సలహా ఇచ్చారట. పురుష మృగం అంటే సగం పులి, సగం మనిషి. గొప్ప శివభక్తుడు. అంతే విష్ణు ద్వేషి. నిరంతరం శివ నామస్మరణ చేస్తూ ధ్యానంలో గడిపేవాడట. నేత్రాలు మూసుకొని ధ్యానంలో ఉన్న పురుష మృగాన్ని చూసి నిద్రిస్తోంది.. అని భావించిన భీముడు 'గోపాల ... గోవిందా' అని స్మరిస్తూ చేరువకు వెళ్ళాడట. విష్ణు నామం వినగానే ధ్యానభంగం కలగడంతో మహోగ్రంగా గర్జిస్తూ భీముని పట్టుకోడానికి లేచింది.

పురుష మృగం భీకర రూపం చూసి ఒక్క క్షణం చలించిన కుంతీ పుత్రుడు ఒక రుద్రాక్ష వదిలి దూరంగా వెళ్లాడట. చిత్రంగా రుద్రాక్ష శివలింగంగా మారిపోయిందట. ఆరాధ్య దైవం దర్శనంతో పురుష మృగం ఆగిపోయింది.



భీముడు మళ్లీ మృగాన్ని సమీపించాడట. విష్ణు నామం వినపడటంతో ఆగ్రహంతో భీముని వెంట పడింది పురుష మృగం. మృగం సమీపంలోకి వచ్చిన ప్రతిసారీ ఒక రుద్రాక్ష వదలడం వల్ల అక్కడ శివలింగం ఉద్భవించిందని అంటారు.

తాను దానిని జయించలేనని అర్థం చేసుకొన్న పాండునందనుడు మృగం తాలూకు సీమ దాటడానికి ప్రయత్నం చేస్తూ దొరికిపోయాడు. ఆ సమయంలో భీమసేనుని ఒక కాలు సీమకు వెలుపల మరో పాదం లోపల ఉన్నాయట. తాను మృగం తాలూకు భూమిలో లేనని భీముడు, కాదు ఉన్నాడని మృగం వాదన చేసుకోవడం మొదలు పెట్టారట. సోదరుని వెతుకుతూ శ్రీకృష్ణునితో కలిసి అక్కడకు చేరుకొన్న యుధిష్టరుడు భీముడు మృగం తళుకుసీమలోనే ఉన్నాడని తీర్పు చెప్పారట. సోదరుడు ఆపదలో ఉన్నప్పటికీ ధర్మం తప్పకపోవడంతో సంతోషించిన మృగం తన విష్ణు ద్వేషాన్ని విడిచిపెట్టడంతో పాటు ధర్మరాజు యజ్ఞానికి కావలసిన పాలను కూడా ఇచ్చింది.

ఈ విధంగా భీముని బలగర్వాన్ని , పురుష మృగం తాలూకు విష్ణుద్వేషాన్ని తొలగించారు నటన సూత్రధారి, లీలామానుష రూపుడైన శ్రీకృష్ణుడు. మరో కథనం కూడా వినిపిస్తుంది. భస్మాసురుని నుండి తప్పించుకొనే క్రమంలో మహేశ్వరుడు పన్నెండు ప్రదేశాలలో దాక్కున్నారట. అవే ఈ ఆలయాలు అని కూడా చెబుతారు.

కథలు ఏమైనప్పటికీ ఈ పన్నెండు క్షేత్రాలలో లింగరాజు స్వయంభూగా వెలిశారన్నది సత్యం. ఆ పన్నెండు క్షేత్రాలు వరుసగా తిరుమలై (ముంచేరై), తిరుక్కురిచ్చి, తిరుప్పరప్పు, తిరునందిక్కరై, పోంమన్నై, పన్నిప్పాగం, కల్కుళం, మేలంకోడ్, తిరువిడైకోడ్, తిరువిత్తంకోడ్, తిరుపంతికోడ్, తిరునాట్టాలం. ఈ ఆలయాలన్నీ తమిళనాడు రాష్ట్రంలో కన్యాకుమారీ జిల్లాలో కేరళ సరిహద్దులలో నెలకొని ఉండటం వలన రెండు రాష్ట్రాల పూజా విధానాలు అనుసరిస్తారు.

## శివాలయ ఒట్టం విధి విధానాలు

'శివాలయ ఒట్టం' యాత్ర చేసే భక్తులు వారం రోజుల ముందు నుండి ఉపవాసం ప్రారంభిస్తారు. పగటి పూట కొబ్బరినీరు, రాత్రి పూట తులసినీరు మాత్రమే తీసుకొంటారు.

మహా శివరాత్రి ముందురోజు సాయంత్రం యాత్రలో మొదటి ఆలయం ఉన్న తిరుమలై (ముంచిరై) చేరుకొంటారు. తామిర భరణి (తామ్రపర్ణి), నదిలో స్నానం చేసి కాషాయ వస్త్రాలు ధరిస్తారు. చేతిలో ఒక తాటి ఆకుల విసనకర్ర ధరించి "గోపాల.. గోవిందా... గోవిందా...గోపాల" అంటూ నామస్మరణ చేస్తూ ఒక ఆలయం నుండి మరో ఆలయానికి పరుగులు పెడతారు. ముంచిరై మహాదేవుని దర్శనంతో యాత్ర ప్రారంభిస్తారు. ఇక్కడ ఆరంభించే యాత్ర "తిరు నాట్టాలం"లోని శ్రీ శంకర నారాయణ స్వామి దర్శనం చేసుకొని ఆలయ చందన సేకరణతో 'శివాలయ ఒట్టం' ముగుస్తుంది.



యాత్రికులు సౌకర్యార్థం మార్గంలో అనేక గ్రామాలవారు స్వచ్ఛందంగా ఆహారం, నీరు, పండ్లరసాలు అందిస్తుంటారు.

మొత్తం దూరం సుమారు వంద కిలోమీటర్లు. భక్తులు ప్రతి ఆలయంలో ప్రదక్షిణలు చేసి, దర్శనం చేయడమే కాకుండా విభూతి, అభిషేక జలం సేకరించాలి. ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా చాలా మంది వాహనాలలో యాత్ర చేస్తున్నారు. శివాలయ యాత్రలోని పన్నెండు ఆలయాలు ద్వాపర యుగం విశేషాలతో పాటు వెయ్యి సంవత్సరాల చరిత్రకు ప్రత్యక్ష సాక్షులు. అత్యంత రద్దీగా ఉండే మహా శివరాత్రి సమయంలో ఈ యాత్ర చేయలేనివారు మిగతా రోజులలో లేదా ఎక్కువగా సోమవారాలు చేస్తున్నారు.

## ఆలయాల చరిత్ర

దరిదాపుగా అన్ని ఆలయాలు ఎనిమిది నుండి పదవ శతాబ్దాల మధ్య కాలంలో చోళ రాజులు నిర్మించినట్లుగా తెలుస్తోంది. సరిహద్దులలో ఉండటమో, స్థానిక వాతావరణ పరిస్థితులలో లేక అనంతర కాలంలో స్థానిక పాలకులు చేసిన మార్పులో తెలియదు. కానీ అన్ని శివాలయ ఒట్టం ఆలయాలలో ద్రావిడ, కేరళ దేవాలయ శైలి సమ్మిళితంగా కనిపిస్తుంది. విశాల ప్రాంగణాలు, పెంకులతో నిర్మించిన మండపాలు, పురాణ గాథలతో నిండిన విమాన గోపురాలు అన్నీ ఎంతో సుందరంగా ఆధ్యాత్మిక ఆలోచనలను పెంపొందించేవిగా కనపడతాయి. మొట్టమొదటి ఆలయాలను ఎవరు నిర్మించారో తెలియదు. కానీ ఆలయాల పునరుద్ధరణ చోళ రాజులు చేసిన తరువాత ఈ ప్రాంతాన్ని పాలించిన ట్రావెన్కోర్, నాయక రాజులు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేసారని తెలుస్తోంది. మానవులలో అన్నీ తామే అన్న అహంకారాన్ని తొలగించడమే కాకుండా శివకేశవులు ఒక్కరే అన్న సత్యాన్ని భక్తులకు తెలియచెప్పడం ఈ యాత్రలోని ముఖ్య సందేశం. తమ మనోభీష్టాలను విన్నవించుకొని అవి నెరవేరిన తరువాత మరుసటి సంవత్సరం శివాలయ యాత్ర చేసేవారు అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. ఏది ఎలా ఉన్నప్పటికీ భక్తులలో ఆధ్యాత్మిక పురోగతిని పెంపొందించేది 'శివాలయ ఒట్టం'.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# తార్కిక శక్తిని పెంచే కథలు

మర్యాద రామన్న అంటే మర్యాదకు, విజ్ఞతకు మారు పేరు. ఎటువంటి వ్యాజ్యం తన వద్దకు వచ్చినా దానిని పరిష్కరించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. తప్పు చేసినవారు ఎంతటి వారైనా సరే తన యుక్తితో మర్యాదరామన్న కనిపెట్టేవారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం నిజంగా జరిగినవి అని చెప్పుకుంటున్న ఈ కథలను తొలుత ఎవరూ గ్రంథస్థం చేయలేదు. పెద్దల నుండి ఆ నోటా, ఈ నోటా విని తెలుసుకున్నవే. ఈ కథలన్నీ పిల్లల బుద్ధికి పదును పెట్టేవిగాను, తార్కిక శక్తిని పెంచుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. నేడు పెరిగిపోతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల అందుబాటులో ఉన్న ఈ కథల్ని చాలా మంది గ్రంథస్థం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా వెలుగులోకి తెస్తున్నారు. ఎవరి శైలి వారిది. ఎవరికి తోచినట్లు వారు గ్రంథస్థం చేసి ఈ కథల్ని ప్రజల్లోకి తీసుకుని వెళుతున్నారు.

రామన్న తల్లిదండ్రులు, భార్యల పేర్ల విషయంలో కూడా ఎటువంటి ఆధారాలు లేవు. మందమతి అయిన మర్యాదరామన్న ఒక్కసారిగా ఎలా మేధావి అయ్యాడు? అనే విషయంపై కూడా భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కాళికాదేవి ప్రసన్నం కావడం వల్ల జ్ఞాని అయ్యాడని కొన్ని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒక సాధువు రామన్న నాలుకపై బీజాక్షరాలు రాయడం వల్ల మహాజ్ఞాని అయ్యాడని మరికొన్ని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సమస్యలను నిశితంగా పరిశీలించి తద్వారా ఎవరికీ అన్యాయం జరగకుండా మర్యాద రామన్న చెప్పిన తీర్పులు నేటి తరం వారిలో సైతం ప్రేరణ కలిగిస్తాయి. మందమతి అయిన ఒక బాలుడు మేధావిగా మారి, కొంత కాలం గ్రామాలలో న్యాయాధికారిగా ఉండి, ఎన్నో తీర్పులు చెప్పి ప్రజల ప్రశంసలందుకున్నాడు. ఆ తరువాత రాజాశ్రయం పొంది రాజుగారి ప్రశంసలందుకుని, ఆయన ఆశీస్సులతో తానే అయిదేళ్ళపాటు రాజుగా పట్టాభిషేకం చేయించుకుని అనేక తీర్పులు ఇచ్చారు. ఆయన చెప్పిన తీర్పులను అందరూ శిరోధార్యంగా భావించేవారు. తరువాత రామన్న రాకుమార్తెను వివాహం చేసుకుని రాజ్యాధికారాన్ని చేపట్టి న్యాయమార్గంలో ప్రజల్ని పాలించారు. ఇంకో కథనం ప్రకారం రామన్న ఒక సందర్భంలో అడవి కన్యను కూడా వివాహం చేసుకున్నట్లు గాథలు ప్రచారంలో ఉన్నాయి. మర్యాదరామన్న కథలు పిల్లలనే కాదు పెద్దలను సైతం ఆకర్షిస్తాయి. మర్యాద రామన్న ఏ ప్రాంతానికి చెందినవారో? ఏ రాజుల ఆశ్రయం సంపాదించారో? ఎవరి కొలువులో ఎక్కువ రోజులు ఉండి తీర్పులు చెప్పారో? ఇలాంటి ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు లేవు. రామన్న జీవిత చరిత్ర సమగ్రంగా ఎక్కడా లేకపోవడంతో ఎవరి ఇష్టం వచ్చిన రీతిలో వారు రాసుకున్నారు.



రామన్న ప్రతిభను చూసి మైసూర్ పులి టిప్పుసుల్తాన్ అతడ్ని రాజుగా చేశారు. మదనపల్లెతో పాటు చుట్టుపక్కల వందలాది గ్రామాలు పాలించే విధంగా శాసనం చేసినట్లు తెలుస్తుంది. క్రీ.శ.1775లో ప్రజల వద్దకే న్యాయం అనే నినాదాన్ని రామన్న ప్రవేశపెట్టి పొరుగు రాజ్యాలలో సంచలనానికి నాంది పలికారు. తొలిసారిగా న్యాయశాస్త్రంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఖండాంతరాల వరకు వ్యాపించి రామన్న పేరు మారుమోగి పోయింది. ఈ విధమైన అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే వీటికి సరైన ఆధారాలు లేవని కచ్చితంగా చెప్పలేం.

మరికొన్ని కథనాల ప్రకారం నాలుగు వందల సంవత్సరాల క్రితం కళింగ ప్రభువుల పాలన కాలానికి రామన్న చెందినవాడని గాథలు ప్రచారంలో ఉన్నాయి. నేటి ఒడిస్సా ప్రాంతాన్ని ఒకప్పుడు కళింగ అనేవారు. అతని పూర్వీకులు కళింగ ప్రాంతంలో జీవనం సాగిస్తూ వలస వచ్చి శ్రీకాకుళంలోని పలు ప్రాంతాలలో నివసించినట్లు కూడా చెబుతుంటారు.

ఎవరు ఎన్ని కథలు ప్రచారం చేసినా వేటికీ ఆధారాలు లేవు. ప్రజలు మాత్రం వీటిని పట్టించుకోరు. అయితే తెలుగునాట మర్యాదరామన్న అనే వ్యక్తి ఉన్నాడని, అతను చెప్పిన తీర్పుల కథలు నిజమేనని చాలా మంది విశ్వసిస్తారు. ఆసక్తిగా సాగే మర్యాదరామన్న కథలను ఇప్పటికీ ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా చదువుకుంటున్నారు. సమయస్ఫూర్తికి, తెలివితేటలకు ప్రతిరూపంలా కనిపించే ఈ కథలు చాలా చమత్కారంగా సాగి అందరినీ విశేషంగా ఆకర్షిస్తాయి. ఈ కథల్లో మర్యాద రామన్న తీర్పులు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయి.

## మర్యాద రామన్నకు ఆపేరు ఎలా వచ్చింది?

రామన్నకు పేరుకు ముందు మర్యాద అనే బిరుదు చేరడానికి భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మర్యాద రామన్న తల్లిదండ్రుల పేర్ల విషయంలో కూడా సరైన ఆధారాలు లేవు. ఒక ఊళ్ళో గోపన్న, గోముఖి అనే దంపతులు ఉన్నారు. వారికి సంతానం కలగలేదు.

సంతానం కోసం వారు ఎక్కని కొండా లేదు. మొక్కని బండా లేదు. ఆ క్రమంలో వారు ఒకరోజు భద్రాద్రి రాముడ్ని దర్శించుకుని తమకు సంతాన భాగ్యాన్ని ప్రసాదించమని ప్రార్థించారు. తిరుగు ప్రయాణంలో వారు ఒక అడవి మార్గంలో నడుస్తుండగా ఒక చిన్న పిల్లవాడి ఏడుపు వినిపించింది. ఆ దంపతులు అటూ ఇటూ చూశారు. ఒక చెట్టు కింద సుమారు ఆరు మాసాలు నిండిన బాలుడు ఏడుస్తూ కనిపించాడు. గోపన్న, గోముఖి దంపతులు ఎంతో ఆనందంగా ఆ పిల్లవాడిని ఎత్తుకున్నారు. ఆ భద్రాద్రి రాముడే ఈ పిల్లవాడ్ని తమకు ప్రసాదించాడని వారు భావించారు. ఆ రామయ్య వరప్రసాదం కావడం చేత ఈ బాలుడికి కూడా రామన్న అని నామకరణం చేశారు.



మరో కథనం ప్రకారం గోపన్న, గోముఖి దంపతులకు సంతానం కలిగినప్పటికీ వారంతా పురిటిలోనే చనిపోతున్నారు. దాంతో వారు అనేక పుణ్యక్షేత్రాలను తిరుగుతున్న క్రమంలో ఒక సాధువు తారసపడి ఆశీస్సులు అందజేయడంతో రామన్న జన్మించాడని భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. రామన్న యుక్త వయస్సు వచ్చే వరకు మందమతిగా ఉన్నాడు. అతనికి ఏమీ తెలిసేది కాదు. ఎటువంటి వృత్తి కూడా నేర్చుకోలేదు. అందరూ వెర్రి రామన్న, పిచ్చి రామన్న అని పిలిచేవారు. ఏం చేయాలో తండ్రికి పాలుపోలేదు.

ఒకరోజు గోపన్న తన కుమారుడైన రామన్నతో మాట్లాడుతూ "నాయనా రామన్నా, నువ్వు ఏ పనీ చేయకుండా ఇలా ఇంట్లోనే కూర్చుని ఉంటే జీవితంలో ఎలా ఎదుగుతావు? కనీసం కొన్ని గొర్రెలను తీసుకుని వెళ్ళి మేపుకుని వస్తే ఏదో ఒక పని నువ్వు చేస్తున్నానని మాకు ఆనందం కలుగుతుంది" అన్నాడు.

రామన్న తండ్రి ఇచ్చిన గొర్రెలను తీసుకుని మేపుకు రావడానికి వెళ్ళాడు. గొర్రెలు మేస్తుండగా రామన్న ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటూ కూర్చున్నాడు. ఇంతలో కొందరు దొంగలు అక్కడకు వచ్చి మందమతి అయిన పిల్లవాడ్ని మోసం చేసి ఆ గొర్రెలను కాజేయదలిచారు. దొంగలు గొర్రెలను అక్కడ నుండి దూరంగా తోలుకుని వెళ్ళి దాచేశారు. దొంగలు తిరిగి రామన్న వద్దకు వచ్చి "అయ్యో! నీ గొర్రెలన్నీ ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయి!" అని అబద్ధం చెప్పి ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షుల్ని చూపించారు. అవగాహన చేసుకునే జ్ఞానం లేని రామన్న ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షుల్ని చూసి తన గొర్రెలే ఎగిరిపోతున్నాయని భ్రమపడి ఏడుస్తూ అక్కడే కూర్చున్నాడు. సాయంత్రమైనా కుమారుడు గొర్రెలను తీసుకుని ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి తండ్రి గోపన్న రామన్న ఉన్న ప్రదేశానికి వచ్చాడు.

"రామన్నా ఇంకా ఇంటికి రాలేదేమిటి?" అడిగాడు తండ్రి గోపన్న. "మన గొర్రెలన్నీ ఆకాశంలో ఎగిరిపోయాయి నాన్నగారు!" చెప్పాడు రామన్న.

"నీ తెలివి తెల్లవారినట్లే ఉంది. గొర్రెలు ఎగిరిపోవడం ఏమిటి? నీ తెలివి తక్కువతనంతో మా పరువు తీస్తున్నావు. ఇక ఇంటికి రాకు, నీ చావు నువ్వు చావు" అన్నాడు తండ్రి గోపన్న.

తండ్రి తనను చావమని అన్నాడనే మాటలు రామన్న మనస్సులో నాటుకు పోయాయి. ఎలాగైనా చచ్చిపోతే పోతుందని అతడు భావించాడు. సమీపంలో ఉన్న కాళికాదేవి ఆలయానికి వెళ్లాడు రామన్న. కాళికాదేవి విగ్రహంతో మాట్లాడుతూ "అమ్మా! నేను చచ్చిపోవాలనుకుంటున్నాను. ఎలా చావాలో అర్థం కావడంలేదు. నీ విగ్రహానికున్న ఆయుధాలతో పొడుచుకుంటే సునాయాసంగా చనిపోవచ్చా?" అని ఆ విగ్రహాన్ని ప్రశ్నించాడు.

కాళికాదేవి విగ్రహం వెలుగులు విరజిమ్ముతూ.. "నాయనా రామన్నా, నువ్వు చావాలనుకోవడం మంచి పని కాదు. జనన, మరణాలు మన చేతుల్లో లేవు. నీ బాగు కోసమే నీ తండ్రి కోపగించుకున్నాడే తప్ప నీ మీద పగ, ప్రతీకారం లాంటివి ఏ కోశానా లేవు. నువ్వు బాగు పడితే నీ తల్లిదండ్రులకంటే సంతోషించేవారు మరొకరు ఉండరు. ఈ రోజు నుండి నీ మందమతిని నేను తొలగించి విద్యా, వివేక, తర్కం, శాస్త్ర జ్ఞానాలను ప్రసాదిస్తున్నాను. వాటి ద్వారా నువ్వు ఈ సమాజంలో న్యాయం, ధర్మాన్ని బతికించు" అంటూ కాళీమాత విగ్రహం మాట్లాడింది.

రామన్న ముఖంలో ఒక్కసారిగా తేజస్సు కనిపించింది. అతనిలోని మందబుద్ధి తొలగిపోయింది. ఆలోచన, తర్కజ్ఞానం పెరిగాయి. అప్పటి నుండి రామన్న మేధావిగా మారి న్యాయశాస్త్ర పారంగతుడయ్యాడు.

ఆయన ధర్మాసనంపై కూర్చుని ఇచ్చే తీర్పులు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేవి. ఈ కథనం ఇలా ఉంటే మరో కథనం ప్రకారం చనిపోవాలనుకుంటున్న రామన్నకు ఒక సాధువు ఎదురుపడి విషయం తెలుసుకుంటాడు. రామన్న పరిస్థితి చూసి ఆ సాధువు జాలిపడతాడు. రామన్న నాలుకపై సాధువు బీజాక్షరాలు రాశాడు. ఆరోజు నుండి రామన్నకు జ్ఞాన సంపద అబ్బిందని కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఇలా భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. చందమామ మాసపత్రికలో మర్యాద రామన్న తీర్పు పేరుతో కథలు ప్రచురించారు. మర్యాద రామన్న కథలను అనేక భాషల్లో అనువదించారు. అలనాటి హాస్య నటుడు పద్మనాభం శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న పేరుతో చలనచిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడు అంతర్జాలంలో యానిమేషన్‌లో కూడా మర్యాద రామన్న కథలు అందుబాటులో ఉన్నాయి.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# 17 ఆగస్టు, 2025 నుండి 23 ఆగస్టు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795




### మేషం

ఈ వారం సంగీతం పట్ల ఆసక్తి చూపిస్తారు. విస్తృత ప్రయత్నం చేసి నేర్చుకోవడానికి గాను గురువులను వెతుకుతారు. వాహనాల అమ్మకాల కొనుగోలు విషయంలో మెలకువలు పాటించి అధిక లాభాలను అందుకోగలుగుతారు. క్యాటరింగ్ వ్యాపారస్తులకి, పూల వ్యాపారస్తులకి, కాలం అనుకూలంగా ఉంది. మెడలో కాలభైరవ రూపు ధరించండి.



### వృషభం

ఈ వారం కోర్టు వ్యవహార తీర్పులు. వాయిదాల రూపంలో ఉంటాయి. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. అహార నియమాలను కచ్చితంగా పాటించండి. టైఫాయిడ్ డయేరియా వంటి జల సంబంధమైన అనారోగ్యాలు అవకాశం ఉంది. జీవిత భాగస్వామికి విలువైన వస్తువులు ఆభరణాలను బహుమతిగా ఇస్తారు . సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది.



### మిథునం

ఈ వారం నూతన విద్యల పట్ల అన్యభాషల పట్ల మక్కువ కలిగి ఉంటారు. విద్య కోసం రుణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. విదేశీ ప్రయత్నాలు విదేశాలలో ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. కార్యాలయంలో సహెూద్యోగుల సహాయసహకారాలు అందుకుంటారు. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది.



### కర్కాటకం

ఈ వారం వ్యాపార భాగస్వాములతో జరిపి చర్చలు సఫలీకృతం అవుతాయి. ప్రభుత్వ ఉత్తర్వులు కోర్టు తీర్పులు మీకు అనుకూలంగా ఉంటాయి. గత స్మృతులు జ్ఞాపకానికి వస్తాయి. ఆర్థికంగా ఒక్కొక్క మెట్టు ఎక్కగలుగుతారు. శ్రమకు తగిన ప్రతిఫలం సాధించడానికి నిరంతరం శ్రమించవలసి ఉంటుంది. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి.



### సింహం

ఈ వారం సహెూదర సహెూదరీ వర్గంతో ఎంతగానో అన్యోన్యంగా ఉండాలని ఆలోచనలు అనుకూలిస్తాయి. గత కొంతకాలంగా ఏవైతే మనస్పర్థలు, చికాకులు ఏర్పడుతున్నాయో అవి నెమ్మదిగా సమసిపోయే విధంగా పరిష్కారాలను కనుగొంటారు. సినీ కళాకారులు సీరియల్స్ వారికి సోషల్ మీడియాలో ఉన్న వారికి మరిన్ని అవకాశాలు చేతికి అందుతాయి.



### కన్య

ఈ వారం స్థిరాస్తులు విలువలు ఘననీయంగా పెరగడం ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది అన్ని సంతోషపడతారు. పెద్ద కళాశాలలో విద్య కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. యజ్ఞ భస్మంతో శివ అర్చన చేసి ఆ భస్మంని బొట్టుగా ధరించండి. భూముల క్రయవిక్రయాలలో మంచి లాభాలను పొందగలుగుతారు. సౌందర్య సాధనాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు.



### తుల

ఈ వారం విందు వినోద కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. పిల్లలు చదువు మానేసి అక్కర్లేని అలవాట్లకి స్నేహాలకి ప్రాధాన్యత ఇవ్వడం మీకు ఏమాత్రం నచ్చదు దీనిని తీవ్రంగా ఖండిస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. చిన్న వ్యాపారస్తులకు కాలం అనుకూలంగా ఉంటుంది. వస్త్ర వ్యాపారస్తులకు మంచి లాభాలు అందుతాయి.



### వృశ్చికం

ఈ వారం కొంతమంది మితిమీరిన ప్రవర్తన అక్కర్లేని కొత్త గొడవలకు నాంది పలుకుతుంది. ప్రభుత్వపరమైన బిల్లులు మంజూరు అవుతాయి. ఎంత కాలంగానో పెండింగ్లో ఉన్న కొన్ని అంశాలు ముందుకు కదులుతాయి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. సాఫ్ట్‌వేర్‌రంగంలో ఉన్న వారికి మంచి అవకాశాలు వస్తాయి.



### ధనస్సు

ఈ వారం దేవాలయ సందర్శనం చేసుకుంటారు. కార్యాలయంలో అధికారులు మెప్పు పొందుతారు. నేర్పుగా వ్యవహరించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. భవిష్యత్తు బంగారు బాటగా కనబడుతుంది. వ్యాపార లావాదేవీలు బాగుంటాయి. పొదుపు పథకాలు ముందడుగులో ఉంటాయి. తల్లిదండ్రులు ఇంటిలోని పెద్దలకు కావలసిన అవసరాలు సకాలంలో తీర్చి మానసిక ప్రశాంతతను పొందుతారు. పూజలలో ఆరావళి



### మకరం

ఈ వారం మీ శక్తీ సామర్థ్యాలు తక్కువ అని అంచనా వేసిన వారికి భంగపాటు తప్పదు. నూతన శుభకార్యాలు, గృహ ప్రవేశాలు, అని శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. మీ భాద్యతలు మీరు నిర్వహిస్తారు. మహా పాశుపత కంకణం ధరించండి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి.



### కుంభం


ఈ వారం మీ శక్తీ సామర్థ్యాలు తక్కువ అని అంచనా వేసిన వారికి భంగపాటు తప్పదు. నూతన శుభకార్యాలు, గృహ ప్రవేశాలు, అని శుభకార్యక్రమాలలో పాల్గొంటారు. మీ భాద్యతలు మీరు నిర్వహిస్తారు. మహా పాశుపత కంకణం ధరించండి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి.





### మీనం

ఈ వారం సంఘంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. విలాసవంతమైన జీవితానికి చేరుకోలేనప్పటికీ సౌకర్యవంతమైనటువంటి జీవితంలో ఇప్పుడు ఉండగలుగుతున్నాము అన్న మనతృప్తిని కలిగి ఉంటారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. సువర్ణాభరణాలు, వజ్రాభరణాలు, కొనుగోలు చేస్తారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


ఆయన్ను చంపింది నేనేనయ్యా..
అయితే ఏమి? నామినీని నేనేగా..?!
INSURANCE


సంవత్సరం లో కోటి రూపాయల
టార్గెట్ పెట్టుకున్నా.. చూసి ధర్మం చేయండి!!


వంశ పారంపర్యంగా రోగాలు వచ్చినట్లే.. ఆరోగ్యం కూడా!
మీ వంశంలో ఎవరైనా ఆరోగ్యంగా ఉన్నారా?!
డా॥ ఫిజీషియన్





కాలిఫోర్నియాలోని
ఈ గ్రామాన్ని బాటిల్ విలేజ్ అని
పిలుస్తారు. పేరులోనే వుంది ఊరి
ప్రత్యేకత. ఈ గ్రామంలోని
ఇళ్లను ఖాళీ సీసాలతో
నిర్మించటం విశేషం.











